PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 148 | విజయవాడ, సోమవారం 30 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 30 December 2024 | Rs



పడగొట్టినా.. తోక మిగిలే!

- బుమ్రాకు నాలుగు వికెట్లు
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 228/9
- భారత్ తొలి ఇన్నింగ్స్ 369/10
- బాక్సింగ్ డే టెస్టు 4వ రోజు

6

ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా హంపి

- కెరీర్‌లో రెండోసారి వరల్డ్ టైటిల్ వశం

చదరంగంలో తెలుగమ్మాయి కోనేరు హంపి (37) చరిత్ర సృష్టించింది. చైనా అమ్మాయి జు వెంజున్ తర్వాత అత్యధిక సార్లు ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ సాధించిన ఘనత దక్కించుకుంది. ఆఖరు రౌండ్లో ఇండోనేసియా గ్రాండ్‌మాస్టర్ ఐరిన్ సుకందర్‌ను ఓడించిన కోనేరు హంపి రెండోసారి వరల్డ్ ర్యాపిడ్ విజేతగా నిలిచింది.



6

దక్షిణ కొరియాలో విమానం కూలి

179 మంది దుర్మరణం

ల్యాండ్ అవుతుండగా రక్షణ గోడను ఢీకొట్టడంతో మంటలు

మువాన్ విమానాశ్రయంలో హృదయ విదారక దృశ్యాలు

సియోల్ : ఇటీవల కజకిస్థాన్‌లో విమాన ప్రమాదం ఘటన మరవకముందే దక్షిణ కొరియాలో మరొక దారుణం చోటు చేసుకున్నది. థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి 181 మందితో బయలు దేరిన విమానం..ఆదివారం ఉదయం దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు నైరుతి దిశగా 290 కిలోమీటర్ల దూరంలో ఉన్న మువాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతూ అదుపు తప్పింది. రన్‌వేపై నుంచి కంచెలోకి దూసుకెళ్లింది. రన్‌వేను తాకుకుంటూ వెళ్లిన విమానం నేరుగా గోడను ఢీకొట్టి మంటల్లో చిక్కుకున్నది. ఈ ప్రమాదంలో విమానం పూర్తిగా కాలిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో మొత్తం 179 మంది మరణించినట్టు అధికారులు, స్థానిక వార్త సంస్థలు తెలియజేశాయి. ఈ ప్రమాదం నుంచి కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే మిగతా 5లో



మృతదేహాలను తరలిస్తున్న సిబ్బంది


రోదిస్తున్న మృతుని బంధువు

బనకచర్లకు గోదారి

- కృష్ణా నది ద్వారా తరలింపు
- కొత్త ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం
- 70-80 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా
- కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్త సాగునీటి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానుంది. గోదావరి వరదల సమయంలో వచ్చే నీటిని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బనకచర్లకు తరలించేందుకు నిర్ణయం తీసుకుంది. అటు పోలవరం, ఇటు ఈ కొత్త ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీళ్లిచ్చే అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గోదావరి నదిలో వరదల సమయంలో ఏటా సరాసరి 2-3 వేల టిఎంసిల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని జలవనరుల శాఖ అంచనా వేసింది. వీటి నుంచి 280 టిఎంసిలను వరదల సమయంలో తీసుకోవడం ద్వారా కృష్ణా డెల్టాకు, రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలు సహా ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో చంద్రబాబు ఈ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా విస్తృత స్థాయిలో రాష్ట్ర రైతాంగానికి, ప్రజలు, పరిశ్రమలకు మేలు జరగనుందని ఆయన భావిస్తున్నారు. కొత్త ప్రాజెక్టుపై చంద్రబాబు ఆదివారం తన నివాసంలో జలవనరులశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు కొత్తగా సాగునీరు అందుతుందని, 22.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చునని, పరిశ్రమలకు దాదాపు 20 టిఎంసిల నీటిని వినియోగించవచ్చని అంచనా వేశారు. ఎగువున ఉన్న ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నదికి తగిన విధంగా నీటి ప్రవాహాలు రావడం లేదని, మరోవైపు గోదావరి నదిలో ప్రతియేటా వేల టిసిఎంలు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని భావించారు. ఈ నీటిలో కనీసం 280 టిఎంసిల నీటిని వరద సమయంలో వినియోగించుకోవాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యంగా తెలిపారు.



ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న సిఎం

నీటి తరలింపు ఇలా...

ఈ ప్రాజెక్టు కోసం రెండు, మూడు రకాల ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. గోదావరి నీటిని కృష్ణానదికి తరలించి అక్కడి నుంచి నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు పంపుతారు. 200 టిఎంసిల సామర్ధ్యంతో బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మించి అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీటిని తరలిస్తారు. బొల్లాపల్లి నుంచి బనకచర్లకు 31 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా నీటిని పంపుతారు. బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగు గంగ, ఎస్ఆర్‌బిసి, నిప్పుల వాగుకు నీళ్లు వెళ్తుంటాయి. నిప్పుల వాగు ద్వారా సోమశిల, మిగతా 5లో

కొత్త సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా కె విజయానంద్‌ను రాష్ట్రప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జివో 2209ను ప్రభుత్వ రాజకీయ కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ ఆదివారం విడుదల చేశారు. ప్రస్తుత సిఎస్‌గా ఉన్న నీరబ్‌కుమార్ ప్రసాద్ ఈ నెల 31తో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన తరువాత విజయానంద్ సిఎస్‌గా ఉంటారని తెలిపారు. ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ పనిచేస్తున్నారు. సిఎస్ రేసులో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, ఆర్‌పి సిసోడియా ఉన్నా.. విజయానంద్‌కే అవకాశం దక్కింది. మిగిలిన ఇద్దరి కంటే ముందుగా విజయానంద్ 2025 నవంబర్‌లో పదవీ విరమణ పొందనున్నారు. ఆ తరువాత సాయిప్రసాద్, సిసోడియా ఉన్నారు. దీంతో, 1992 బ్యాచ్‌కు చెందిన విజయానంద్‌కు అవకాశం కల్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ అసిస్టెంట్ కలెక్టర్‌గా, రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా, రంగారెడ్డి జాయింట్ కలెక్టర్‌గా, శ్రీకాకుళం, నల్గొండ జిల్లాలకు కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తరువాత ఆయన ఎక్కువ కాలం విద్యుత్ సంస్థల్లో పని చేశారు. 2019 నుంచి 2021 వరకు ఎన్నికల సంఘం ప్రధాన అధికారిగా, ఆ తరువాత నుంచి ఇప్పటి వరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సేవలందించే అవకాశం కల్పించినందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, గొట్టిపాటి రవికుమార్‌లకు విజయానంద్ ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిని, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలు, సమాజంలోని బడుగు బలహీన వర్గాల సమ్మిళిత అభివృద్ధి అందించాలనే ముఖ్యమంత్రి దార్శనికతను అమలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



8న ప్రధాని పర్యటనను అడ్డుకోండి

- విశాఖ ప్రజలకు వి శ్రీనివాసరావు పిలుపు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి జనవరి 8న వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో దీనికి ముందే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తామని, సొంతగనులు కేటాయించి పూర్తి సామర్ధ్యంతో ప్రభుత్వ ఆధీనంలోనే నడుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. లేకపోతే మోడీ పర్యటనను సిపిఎం అడ్డుకుంటుందని తెలిపారు. విశాఖ ప్రజలు, కార్మికులు కూడా ఇందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గతంలో అనేక సందర్భాల్లో ప్రధాని రాష్ట్రానికి వచ్చినప్పటికీ విశాఖ ఉక్కు పరిశ్రమపై స్పష్టమైన ప్రకటన చేయకుండా తప్పించుకున్నారని గుర్తు చేశారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ వాగాడంబరం తప్ప ఆచరణ లేదన్నారు. పెందుర్తి సుజాత నగర్‌లో జరుగుతున్న సిపిఎం విశాఖ జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.గంగారావు, బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకటరావులతో కలిసి ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. నరేంద్ర మోడీ విశాఖ వచ్చినప్పుడల్లా స్టీల్ ప్లాంట్ విషయంలో మౌనంగా ఉంటున్నారని, ప్రైవేటీకరణకు కావలసిన పనులన్నీ చాప కింద నీరులా చేసుకుంటూ పోతున్నారని అన్నారు. టిడిపి, బిజెపి, జనసేన నాయకులు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రజలను మభ్యపెట్టాలని చూసు న్నారని వివరించారు. ఇటీవల ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసిన సందర్భంలో కూడా ప్రైవేట్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ప్రస్తావించారుగానీ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఎలా కాపాడాలి, ఎలా నిలబెట్టాలి అనే దానిపై మాట్లాడలేదని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసినప్పుడు ప్రైవేటీకరణ పదం కాకుండా డిజిన్వెస్ట్‌మెంట్ మాట వెలుగులోకి వచ్చిందని వివరించారు. మిట్టల్ కంపెనీ కోసం స్టీల్‌ప్లాంట్‌ను బలి చేయాలని చూడడం తగదన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు అనుమతులు రద్దు చేయాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై స్పష్టమైన ప్రకటన మోడీతో చేయించాలని డిమాండ్ చేశారు.

రుషికొండ కట్టడాలను సైన్స్ మ్యూజియంగా మార్చాలి

రుషికొండపై రూ.525 కోట్లతో నిర్మించిన భవనంపై ప్రస్తుత ప్రభుత్వం మాట్లాడలేదని, మిగతా 5లో

గుజరాత్ కెమికల్ ఫ్యాక్టరీలో ప్రమాదం

- విషవాయువులు పీల్చి నలుగురు మృతి

బరూచ్ : గుజరాత్‌లో మరో విషాదం చోటు చేసుకుంది. బరూచ్ జిల్లాలోని ఒక కెమికల్ ప్లాంట్‌లో విషపూరిత వాయువులు పీల్చి నలుగురు కార్మికులు మరణించారు. జిల్లాలోని దహేజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంబేట గ్రామంలో ఉన్న గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ లిమిటెడ్ (జిఎఫ్ఎల్)లో ఈ దారుణం జరిగింది. జిఎఫ్ఎల్ ప్రొడక్షన్ యూనిట్‌లో శనివారం రాత్రి 8 గంటల సమయంలో పైపు నుంచి వెలువడే విషపూరిత వాయువును పీల్చి నలుగురు కార్మికులు స్పృహతప్పి పడిపోయారు. వెంటనే వీరిని బరూచ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వీరిలో ముగ్గురు ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకు మరణించారు. మరొకరు ఉదయం 6 గంటలకు మరణించారు. ఈ వివరాలను దహేజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బిఎం పాటిదార్ విలేకరులకు వెల్లడించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపించామని, ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోందని తెలిపారు. అలాగే, మృతుల్లో ముగ్గురు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని బరూచ్ జిల్లా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ మనీషా మనాని తెలిపారు. తెలిపారు. మృతుల్ని బరూచ్‌కు చెందిన మగనదియా (48 ఏళ్లు), జార్ఖండ్‌లోని అధౌరకు చెందిన మద్రికా యాదవ్ (29), ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్రాకు చెందిన సుచితా ప్రసాద్ (39), మహేష్ నంద్లాల్ (25)గా గుర్తించారు. మృతుల్లో ముగ్గురు సంస్థ ఉద్యోగులని, మరొకరు కాంట్రాక్టు ఉద్యోగి అని తెలిపారు.



ప్రమాదం జరిగిన గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ

ఈ ప్రమాదంపై జిఎఫ్ఎల్ విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కార్మికులను రక్షించుకోవడానికి తాము ఎన్ని ప్రయత్నాలు చేసినా దురదృష్టవశాత్తూ అవి విఫలం చెందాయని తెలిపింది. మరణించిన ప్రతీ ఉద్యోగి కుటుంబానికి రూ. 30 లక్షల పరిహారం ప్రకటించింది. అలాగే చట్టబద్ధమైన బకాయిలు, బీమా ప్రయోజనాలు, పెండింగ్‌లో జీతాలను పూర్తిగా చెల్లిస్తామని తెలిపింది. కాగా, గుజరాత్‌లోని పరిశ్రమల్లో ఇటీవల తరుచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అహ్మదాబాద్‌లోని ఒక టెక్స్‌టైల్ డేయింగ్ పరిశ్రమలో అక్టోబర్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గత నెలలో వడోదరలోని ఐఓసి రిఫనరీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.



పిఎస్‌ఎల్‌విసి-60 ప్రయోగానికి కౌంట్‌డౌన్ మొదలు

2

సంస్కృతి, వారసత్వానికి భాషతో ముడి

- మంత్రి సత్యకుమార్
- ముగిసిన ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభ

6

అమిత్ షా రాజీనామా చేయాలి

దళిత, గిరిజన ప్రజా సంఘాల నిరసన, ర్యాలీ



విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న నేతలు

2

అసంతృప్తిలో టిడిపి సీనియర్లు

- పదవుల కోసం ఎదురుచూపు
- పట్టించుకోని అధినాయకత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార టిడిపిలో పదవుల కేటాయింపుపై సీనియర్ నేతలు అసంతృప్తి రాగం వినిపిస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినా ఇప్పటికీ ఎలాంటి పదవులు రాలేదని కొంతమంది నేతలు అసంతృప్తిగా ఉంటే, మంత్రి మండలిలో తమకు ప్రాతినిధ్యం కల్పించలేదనే ఆవేదనలో మరికొంతమంది ఉన్నారు. పదవులు లేవనే అసంతృప్తితో సీనియర్ నేతలు కంభంపాటి రామ్మోహన్‌రావు, టిడి జనార్ధన్, వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు, గల్లా జయదేవ్, పనబాక లక్ష్మి ఉన్నారు. వైసిపి నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన బీదా మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, మోపిదేవి వెంకటరమణ ఇటీవల తమ స్థానాలకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ స్థానాలలో తమకు అవకాశం కల్పిస్తారనే ఆశతో ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేయడంతో పాటు చివరి వరకు ఎదురుచూశారు. కానీ వీరిని కాదని చివరకు టిడిపి నుంచి బీదా మస్తాన్‌రావు, సానా సతీష్‌కు, బిజెపి నుంచి ఆర్ కృష్ణయ్యకు పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది. తమకు అవకాశం కల్పించకపోగా రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అధిష్టానం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని సీనియర్ నేతలంతా గుర్రుగా ఉన్నారు. గతంలో ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే పార్టీలో చర్చించేవారని, ఇప్పుడు ఆ పద్ధతి లేకుండా పోయిందని పార్టీ సీనియర్ నేత ఒకరు అన్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఇలాంటి సంప్రదాయం ఎప్పుడూ లేదని అంటున్నారు. టిడి జనార్ధన్ 2014-19 హయాంలో అధికారంలో ఉండగా.. పార్టీలో, ప్రభుత్వంలో కీలక నేతగా వ్యవహరించారు. ఇటీవల ఎన్నికల సమయంలోనూ చురుగ్గా వ్యవహరించినా, ఇప్పటి వరకు ఎలాంటి పదవి ఇవ్వలేదు. దేవినేని ఉమామహేశ్వరరావును అధిష్టానం పూర్తిగా పట్టించుకోవడం లేదనే చర్చ పార్టీలో నడుస్తోంది. కంభంపాటి రామ్మోహన్‌రావు ఎన్నికల సమయంలో ఏలూరు లోక్‌సభ సీటును ఆశించినా మొండిచెయ్యి చూపించారు. ఇటీవల భర్తీ చేసిన రాజ్యసభ స్థానాల్లో తనకు అవకాశం ఉంటుందని ఆశగా ఎదురుచూసినా ఫలితం లేకుండాపోయింది. వర్ల రామయ్యకు గతంలోనే రాజ్యసభ సభ్యునిగా అవకాశం రావాల్సి ఉండగా, కనకమేడల రవీంద్రకు వచ్చింది. మరోపక్క మంత్రివర్గంలో సీనియర్లకు మొండిచెయ్యి చూపించడమే కాకుండా పార్టీలో, ప్రభుత్వంలో తమ మాట చెల్లుబాటు కావడం లేదనే అసంతృప్తి పార్టీ సీనియర్ ఎమ్మెల్యేల్లో నెలకొంది. కళా వెంకట్రావు, కన్నా లక్ష్మీనారాయణ, బొండా ఉమామహేశ్వరరావు, పితాని సత్యనారాయణ, జ్యోతుల నెహ్రూ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, గంటా శ్రీనివాసరావు, కూన రవికుమార్, పత్తిపాటి పుల్లారావు, కొండ్రు మురళీమోహన్, యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి వంటి నేతలు అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. సీనియర్ మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి జిల్లా పార్టీలో, ప్రభుత్వంలో తన మాట చెల్లుబాటు కావడం లేదని గుర్రుగా ఉన్నారు. నెల్లూరులో కూడా తన పెత్తనం సాగడం లేదని, అదే జిల్లాకు చెందిన నారాయణకే పెత్తనం అప్పగించారని అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.



ఎమ్మిగనూరు పట్టణంలో ప్రజా ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం నేతలు

ప్రజల ఐక్యతకు ఉద్యమించాలి

- మతం పేరుతో చిచ్చు పెడుతున్న ప్రధాని
- మోడీకే చంద్రబాబు, జగన్ మద్దతు : ఎంఎ.గఫూర్
- సిపిఎం కర్నూలు జిల్లా 23వ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

ప్రజల ఐక్యతకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. సిపిఎం కర్నూలు జిల్లా 23వ మహాసభ ఎమ్మిగనూరులో ఆదివారం ప్రారంభమైంది. తొలుత మున్సిపల్ కార్యాలయం నుండి సోమప్ప సర్కిల్ వరకు ప్రజా ప్రదర్శన నిర్వహించారు. డప్పుల దరువు, మహిళల కోలాటంతో ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరి వేదికపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామాంజినేయులు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో గఫూర్ మాట్లాడారు. మతం పేరుతో ప్రజల మధ్య మోడీ చిచ్చు పెడుతున్నారని, అలాంటి మోడీకి రాష్ట్రంలో చంద్రబాబు, జగన్ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. భారతదేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం వచ్చిందన్నారు. మసీదులను తవ్వాలని బిజెపి పనిగా పెట్టుకుందని విమర్శించారు. బడా కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తోన్న మోడీ... రైతులు రుణాల మాఫీ కోసం ఆందోళన చేస్తుంటే లాఠీలతో కొట్టిస్తున్నారని అన్నారు. బ్యాంకులను ముంచిన ఘనులంతా మోడీ మిత్రులని విమర్శించారు. టిడిపి, వైసిపి ఎంపిలు కూడా పార్లమెంటులో మోడీని బలపరుస్తున్నారన్నారు. జగన్ నిర్వాకం వల్లే ప్రస్తుతం విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల భారం పడిందని, రూ.12 లక్షల కోట్లు అప్పు చేస్తే, ఇందులో రూ.2 లక్షలా 80 వేల కోట్లు బటన్ నొక్కడం ద్వారా ప్రజలకు పంచినట్లు చెబుతున్నారని, మిగతా డబ్బులు ఎవరి జేబులోకి వెళ్లాయని ప్రశ్నించారు. ప్రధాని మోడీ విమానాలను, రైల్వేలను అమ్మేస్తున్నారని, చంద్రబాబు రోడ్లను అమ్మి టోల్‌గేట్ పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారని వివరించారు. రూ.69 వేల కోట్లతో అమరావతి కట్టే చంద్రబాబుకు కర్నూలులోని సాగునీటి ప్రాజెక్ట్ పట్టడం లేదని, గుండ్రేవుల, వేదవతి పూర్తి చేస్తానని హామీ ఇచ్చి తట్టెడు మట్టి కూడా వేయలేదని అన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు, కష్టజీవుల కోసం పోరాడేది సిపిఎం అని, భవిష్యత్ ఎర్ర జెండాదేనని తెలిపారు. అదాని, అంబానీలు కరెంటు, గ్యాస్ చాలదని ఇప్పుడు గ్రామీణ ప్రాంతంలోని సంతలపై పడ్డారని, భవిష్యత్తులో అదానికీ ఈ సంతలను కూడా కట్టబెట్టాలని చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఏడు నెలలు కావస్తున్నా అమలు చేయడం లేదని వివరించారు. రాయలసీమ నుంచి ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు గెలిచినా ఇక్కడి వలసలు వారికి పట్టడం లేదన్నారు. రాష్ట్రంలో బిజెపికి తోడు పవన్ కల్యాణ్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం పోరాడిన ఘనత సిపిఎందేనని తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, మాజీ సిఎం జగన్ నియోజకవర్గంలో రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం ఈ పాలకుల చేతకాని తనానికి నిదర్శనమని అన్నారు. 2023కు సంబంధించిన కరువు మండలాల రైతులకు నష్టపరిహారం నేటికీ చెల్లించడం లేదన్నారు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న చంద్రబాబు రైతులకు ఎకరాకు చెల్లించే అన్నదాత సుఖీభవ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై అందరూ ఏకమై పోరాడాలని, హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, రాష్ట్ర నాయకులు రామన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

రాగల రోజుల్లో బహుముఖ ఉద్యమాలు

- జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
- బిజెపి వ్యతిరేక శక్తులను ఒక వేదికపైకి తేవాలి
- విశాఖ జిల్లా మహాసభలో వి.శ్రీనివాసరావు



సిపిఎం ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మూడేళ్లుగా చారిత్రక పోరాటం సాగుతోందని, కార్మిక సంఘటిత శక్తికి ఏ పాలకుడైనా తలొగ్గాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ జిల్లా పెందుర్తి-సుజాత నగర్‌లో జరిగిన సిపిఎం 24వ మహాసభ రెండోరోజు ఆదివారం ప్రతినిధుల సభలో వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ తమ సందేశాలిచ్చారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రధాని మోడీ మూడేళ్లుగా ప్రయివేటీకరణపై అడుగు వేయలేకపోవడానికి కారణం కార్మిక పోరాటం వెనుక సిపిఎం ఉండటమేనని తెలిపారు. తాజాగా డిజిన్వెస్ట్‌మెంట్ ప్రతిపాదన ముందుకు తెస్తున్నారని, రాగల రోజుల్లో మరింత సమరశీలంగా పోరాడాలని సిపిఎం శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగం జమిలి ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని, 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనే బిజెపి నినాదంలో భారతీయ సహజసిద్ధమైన వారసత్వాన్ని చీల్చే కుట్ర దాగి ఉందని వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థ జిడిపి 6.7 శాతం నుంచి రెండున్నర శాతం తగ్గిపోయినా మోడీ వికసిత భారత్ అనడం, రాష్ట్రంలో చంద్రబాబు విజన్-2047 అనడం ఎవర్ని మోసగించడానికని ప్రశ్నించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తాజా బడ్జెట్‌లో రూ.24 వేల కోట్లు తగ్గించారని తెలిపారు. దేశంలో సనాతన ధర్మం పేరుతో చట్టాల్లో మార్పు తెచ్చి ప్రార్థనా స్థలాల స్వతంత్రతను దెబ్బతీస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి వ్యతిరేక శక్తులు ఒకేతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశాఖలో కమ్యూనిస్టు ఉద్యమానికి విద్యార్థి ఉద్యమం ఎలా తోడ్పాటునిచ్చిందన్న అంశాలను సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు ప్రతినిధుల సభలో వివరించారు. నివాసిత ప్రాంతాల్లో స్థానిక ప్రజా, కార్మిక సమస్యలపై కృషి చేయడం ద్వారా ప్రజా పునాది పెరుగుతోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. నయా ఉదారవాదం, హిందుత్వ విద్వేష రాజకీయాలను ఎదుర్కోవాలంటే ప్రజల సాంస్కృతిక వ్యవహారాల్లో జోక్యం పెరగాల్సి ఉందన్నారు. మానవత్వానికి సంబంధించిన సంస్కృతిని ప్రజల్లోకి వివిధ కళారూపాల్లో తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శిగా ఎం.జగ్గునాయుడు



జిల్లా మహాసభలో 24 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నికైంది. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శిగా ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులుగా డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.పద్మ, కెఎం.శ్రీనివాస్, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎస్‌ఎల్‌విసి-60 ప్రయోగానికి కౌంట్‌డౌన్ మొదలు

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

పిఎస్‌ఎల్‌విసి-60 ప్రయోగానికి ఆదివారం రాత్రి 8 గంటల 58 నిమిషాలకు 25 గంటల కౌంట్‌డౌన్ ప్రక్రియ మొదలైంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ భవిష్యత్తులో భారతీయ అంతరిక్ష స్టేషన్ నిర్మాణం కోసం పరిశోధనాత్మక ప్రయోగాలను మొదలు పెడుతోంది. ఇందులో భాగంగా శ్రీహరికోటలోని మొదటి ప్రయోగవేదిక నుండి సోమవారం రాత్రి తొమ్మిది గంటల 58 నిమిషాలకు, పిఎస్‌ఎల్‌వి సి-60 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో ఇది 62వ రాకెట్ ప్రయోగం. ఈ ప్రయోగం అనంతరం 15 నిమిషాల తరువాత రాకెట్‌లోని రెండు స్పేడెక్స్ మిషన్లు కొద్ది సెకండ్ల తేడాతో కక్ష్యలోకి ప్రవేశిస్తాయి. ఈ రాకెట్ ద్వారా 440 కిలోల బరువు కలిగిన స్పేడెక్స్ మిషన్‌ను రెండు వేరువేరు భాగాలుగా ప్రయోగిస్తున్నారు. ఈ స్పేడెక్స్ మిషన్‌లో రెండు ఉపగ్రహాలు ఉంటాయి. అవి ఈ రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి వెళ్లిన తరువాత విడివిడిగా ఉండే రెండు మిషన్‌లు ఒకదానికి ఒకటి కలుసుకుంటాయి. దీనిని సాంకేతికపరంగా డాకింగ్ సిస్టమ్ అంటారు. ఇది విజయవంతమైతే డాకింగ్ టెక్నాలజీ కలిగిన నాల్గవ దేశంగా ఇండియా నిలుస్తుంది. భూమికి 470 కిలోమీటర్ల తక్కువ దూరంలోని వృత్తాకార కక్ష్యలో ఈ స్పేడెక్స్ మిషన్ తిరుగుతూ డాకింగ్ పరిశోధనలు నిర్వహించనుంది. భవిష్యత్తులో ఇస్రో నిర్మించనున్న భారతీయ అంతరిక్షస్టేషన్‌కు హోమగాములు వెళ్లినప్పుడు వారు వెళ్లిన మిషన్‌ను అంతరిక్ష స్టేషన్‌కు అనుసంధానం చేయడం తిరిగి రావాలనుకున్నప్పుడు విడిపోవడం వంటి డాకింగ్ టెక్నాలజీపై పరిశోధనలు నిర్వహించడానికి ఈ స్పేడెక్స్ మిషన్‌ను ఇస్రో ప్రయోగిస్తోంది.

వేతనాల పెంపుపై 108 ఉద్యోగుల హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


'108' ఉద్యోగుల వేతనాన్ని మరో రూ.4 వేలు పెంచి అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి కిరణ్‌కుమార్, కెవివి నరసింహారావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2017లో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిఓ 49 ద్వారా నెలకు రూ.4 వేల వేతనాన్ని పెంచి అమలు పరిచారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం నిలిపివేయడంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. మరలా జిఓను పునరుద్ధరించి వేతనాలు పెంచారన్నారు. 190 కొత్త 108 వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఎంఇఒ-1 బదిలీలు చేపట్టాలి

- అసోసియేషన్ అధ్యక్షులు సింహాచలం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మండల విద్యాశాఖ అధికారి (ఎంఇఒ)-1లకు జీరో సర్వీస్‌తో బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంఇఒ అసోసియేషన్ అధ్యక్షులు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడేళ్ల నుంచి బదిలీలు లేకపోవడంతో సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఒకే ప్రదేశంలో పనిచేసిన వారికి తప్పనిసరిగా బదిలీలు చేయాలని, ఏడేళ్లు గడుస్తున్నా నిర్వహించలేదని వివరించారు.



కళాకారులతో మంత్రి కందుల దుర్గేష్, ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు

ముగిసిన కూచిపూడి పతాక స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి

కృష్ణాజిల్లా మొవ్వ మండలం కూచిపూడి కళాక్షేత్రంలో కూచిపూడి పతాక స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ సిదేంద్ర యోగి, కూచిపూడి కళాపీఠం, కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూచిపూడి నృత్యం అజరామంగా విరాజిల్లే విధంగా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. మత్స్యశాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని శాఖల సమన్వయంతో భావితరాలకు కూచిపూడి నృత్యాన్ని చేరువ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

అమిత్ షా రాజీనామా చేయాలి

- దళిత, గిరిజన ప్రజా సంఘాల నిరసన, ర్యాలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపరచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని దళిత, ప్రజా సంఘాలు, కార్మిక, మహిళా, పలు రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బందరు రోడ్డు పిడబ్ల్యుడి అంబేద్కర్ వరకు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన నిరసన సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అమిత్ షా అహంకారపూరిత, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దేశానికి మనువాద మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో దళిత, గిరిజన, మహిళలపై దుర్మార్గమైన దాడులు, అవమానాలు జరుగుతున్నా ఏమాత్రం మాట్లాడని ప్రధాని మోడీ... అమిత్ షాను వెనుకేసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ తరహా ధోరణులు పెత్తందారీ పోకడలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజ్యాంగ బద్ధంగా లభించిన కేంద్ర హోంశాఖ మంత్రి పదవి నుంచి అమిత్ షా తప్పుకోవాలని దళిత, గిరిజన, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమం లో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జి నటరాజ్, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి క్రాంతి కుమార్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనరు నేతి మహేష్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, అంబేద్కర్ మిషన్ రాష్ట్ర అధ్యక్షులు గంజి రామారావు, మెండా క్రాంతి కుమార్, జై భీమ్ యాక్టివ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతా వెంకటేశ్వర్లు, పరసా సురేష్‌కుమార్, జి కొండలరావు, డిబిఎఫ్ రాష్ట్ర నాయకులు కొనసం రాము, ఆర్‌పిఐ నాయకులు దానిచేలు, న్యాయవాదులు ఆవుల వెంకటరావు, శ్యామ్, విజయవాడ బార్ అడ్వకేట్స్ బాలకోటేశ్వరరావు, దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున, ఐఎఫ్‌టియు నాయకు లు రామకృష్ణ, ఉద్యోగ సంఘ నాయకులు జి నగేష్, జాలాది మోహన్, కృష్ణ, డిబిఆర్‌సి నాయకులు జి అరుణమ్మ, కోటేశ్వరరావు, ప్రసాద్, విజయ పాల్గొన్నారు.



శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల దీక్షకు మద్దతుగా మాట్లాడుతున్న పి మధు

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పోరాటం న్యాయమైంది : మాజీ ఎంపి పి మధు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పోరాటం న్యాయమైనదని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు కోరారు. తిరుపతిలోని ఎడి బిల్డింగ్ ఎదుట గత 132 రోజులుగా శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళితో కలిసి ఆయన ఆదివారం సందర్శించి మద్దతు తెలిపారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ జీవితాలు ఎంతో ఆనందంగా ఉంటాయని భావించిన తమకు నిరాశే ఎదురైందని చిరు వ్యాపారులు మధు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి మెట్టు మార్గంలో 30కిపైగా కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం వారిని అక్కడ వ్యాపారం చేసుకోకుండా అధికారులు అడ్డుపడుతున్నారని, ఈ నేపథ్యంలో టిటిడి పరిపాలనా భవనం వద్ద దీక్షకు దిగినట్టు తెలిపారు. చిరు వ్యాపారస్తులకు న్యాయం చేయాలని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తోపాటు టిటిడి చైర్మన్, ఇఒ, అడిషనల్ ఇఒల దష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలతోపాటు టిటిడి అధికారులు స్పందించి శ్రీవారి మెట్టు చిరు వ్యాపారస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు యుగంధర్ చిట్టిబాబు, మధు, చిరంజీవి, పెంచలయ్య, ప్రకాష్, రామ్మూర్తి, నరసింహ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు
- ముగిసిన తిరుపతి, పల్నాడు, భీమవరం బాలోత్సవాలు



తిరుపతి బాలోత్సవంలో నిర్వహించిన వ్యాస రచన పోటీలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి- యంత్రాంగం

చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీస్తూ రెండు రోజులుగా ఉత్సాహంగా సాగిన తిరుపతి, పల్నాడు, భీమవరం బాలోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు చిన్నారుల నత్యాలు, సాంస్కతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. వివిధ రకాల ఆటపాటలతో ఆకట్టుకున్నారు. క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో ప్రతిభను చాటుకున్నారు. తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న బాలోత్సవంలో చివరి రోజు శాస్త్రీయ నృత్యాలు, కోలాటాలు, జానపద నృత్యాలు, దేశభక్తి గీతాల ఆలాపనలు, తదితర పోటీలు ఆకట్టుకున్నాయి. బాలోత్సవంలో 163 పాఠశాలల నుండి 8500 మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథి రోటరీ క్లబ్ సభ్యులు కెవి చలపతి మాట్లాడుతూ విద్యార్థులు బలమైన కోరికలను ఎంచుకోవాలని, ఆ దిశగా ప్రణాళికాబద్ధకంగా ముందుకు వెళ్లాలని సూచించారు. నిరంతరం కృషి చేస్తే ఎలాంటి సమస్యనైనా అధిగమించొచ్చని తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా తమకు అనుకూలంగా మరల్చుకుంటే లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని అన్నారు. మానవ హక్కుల నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పెంచుకోవాలని, కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు మల్లారపు నాగర్జున, గౌరవ అధ్యక్షులు టి దామోదరం, అధ్యక్షులు నడ్డి నారాయణ, కార్యదర్శి పయ్యావుల గురునాథం, తదితరులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని పాలడుగు నాగయ్య చౌదరి, కొత్త రఘురామయ్య కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న పల్నాడు బాలోత్సవంలో చివరి రోజు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా బాలోత్సవం అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ పాల్గొని మాట్లాడారు. సంస్కృతీ, సంప్రదాయాలు, కళలకు కొత్త ఊపిరి పోస్తూ విద్యార్థుల్లో అభ్యుదయ భావాలు రేకెత్తిస్తున్న బాలోత్సవాలకు ముగింపు లేదని తెలిపారు. ర్యాంకులు, మార్కుల మధ్య కొట్టుమిట్టాడుతున్న విద్యార్థుల్లో దేశభక్తి, అభ్యుదయ భావాలు రేకెత్తించడం కోసం బాలోత్సవాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ప్రముఖ రచయితలు కాంతారావు, సుబ్బారావు, అమరావతి బాలోత్సవం అధ్యక్షులు డాక్టర్ రామరాజు మాట్లాడుతూ.. బాలోత్సవాల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా విధానం మారుతోందని, స్నేహభావం అలవడుతోందని తెలిపారు. పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో పల్నాడు బాలోత్సవం అధ్యక్షులు చిలకల రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 65 అంశాల్లో వేలాది మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్లో భీమవరం బాలోత్సవం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. చిన్నారుల నృత్యాలు, ఆట పోటీలు ఆకట్టుకున్నాయి. చివరి రోజు ప్రదర్శించిన రోప్ స్కిప్పింగ్, మాల్కంబ్ పోల్ చూపరులను కట్టిపడేశాయి. ఈ కార్యక్రమానికి భీమవరం ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారుల్లో ప్రతిభాపాటవాలను వెలికి తీయడానికి బాలోత్సవాలు దోహదం చేస్తాయని తెలిపారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం బాలోత్సవం అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గాతల జేమ్స్, అసోసియేట్ కార్యదర్శి జి.ధనుష్, ఎస్‌సిహెచ్‌బిఆర్ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, డిఎన్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

లాయర్ శేషాద్రి మృతిపై వివాదం

- అనారోగ్యంతోనే మృతి అంటున్న పోలీసులు
- కొట్టడం వలనే చనిపోయాడంటున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో లాయర్ శేషాద్రి శనివారం రాత్రి మృతి చెందారు. ఈ మృతిపై సర్వత్రా వివాదాలు అలుముకుంటున్నాయి. అనారోగ్యంతోనే శేషాద్రి మృతి చెందారని పోలీసులు చెబుతుండగా, పోలీసులు కొట్టడంతోనే ఆయన చనిపోయాడని లాయర్లు ఆరోపిస్తున్నారు. దీనిపై లాయర్లు ఆదివారం సర్వజన ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. శేషాద్రిని త్రీటౌన్ సిఐ శాంతిలాల్ స్టేషన్‌లో కొట్టడంతోనే ఆయన మృతి చెందారంటూ ఆందోళన చేపట్టారు. అనారోగ్యంతో మృతి చెందారని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శేషాద్రి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. వార్షిక నేర గణాంకాల వెల్లడి సందర్భంగా జిల్లా ఎస్‌పి జగదీశ్ మీడియాతో మాట్లాడుతూ శేషాద్రి అనారోగ్యంతోనే మృతి చెందినట్టు భావిస్తున్నామని, సిఐ శాంతిలాల్ అతి సౌమ్యుడని తెలిపారు.

న్యాయవాది మృతికి 'ఐలు' దిగ్భ్రాంతి

అనంతపురంలో న్యాయవాది మృతిపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐలు అధ్యక్షులు కె.కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.మాధవరావు ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులు తమ పరిధిని దాటి సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్నారని, న్యాయవాది వివరణను పట్టించుకోకుండా దురుసుగా ప్రవర్తించారని, ఒత్తిడికి లోనై గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు. ప్రభుత్వాలు వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి 'వేడుకోలు'

- ఎపి పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖలో తొలగించిన ఆరోగ్య సహాయకుల ఉద్యోగాల సాధన కోసం సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'వేడుకోలు' కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివివి ప్రసాద్ వెల్లడించారు. ఉద్యోగాలు కోల్పోయిన ఆరోగ్య సహాయకులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తోపాటు కూటమి నేతలకు వినతిపత్రాలు అందించామని వెల్లడిం చారు. ఉద్యోగాలు కోల్పోయి తీవ్ర ఒత్తిడితో ఇప్పటికే ముగ్గురు మరణించారని, అధికారులు, ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సుబ్బారెడ్డికి ప్రజానాట్య మండలి ఘన నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డికి ఆ సంస్థ ఘనంగా నివాళు లర్పించింది. విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం నిర్వహించిన కళా నీరాజనం కార్యక్రమంలో తొలుత గాదె సుబ్బారెడ్డి చిత్రపటానికి ప్రజానాట్యమండలి కళాకారులు, సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సృజనకారుడుగా, నటుడుగా, దర్శకుడిగా, నాటక రచయితగా సుబ్బారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా సమస్యలపై చైతన్యం రగిల్చేందుకు చేసిన కృషి మరువలేమని ఈ సందర్భంగా కళాకారులు తమ కళారూపాలతో తెలియజేశారు. సుబ్బారెడ్డి రచించిన టామీ... టామీ సహా ఇతర నాటకాలు, పలు అంశాలపై నృత్య రూపకాలను కళాకారులు ప్రదర్శించారు. సుబ్బారెడ్డికి నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ప్రముఖ నటుడు అజయ్‌ఘోష్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మనవడు, మనవరాలు శ్రీనందన్, కీర్తి రూ.50 వేల విరాళాన్ని ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీకి అందజేశారు. ఆయన భార్య శివలీల, కుమార్తె శిరీష పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి మంగరాజు అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి కె అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి ఎస్‌కె కాశిం, ఉమ్మడి రాష్ట్ర సీనియర్ నాయకులు కె దేవేంద్ర, ప్రజానాట్య మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వి ఆనంద్, ప్రధాన కార్యదర్శి కె నరసింహ, ప్రజానాట్య మండలి ఎంపి కమిటీ సభ్యులు ఎస్‌కె కాశిం, ఎస్‌కె వలి, పి అప్పన్న, డి శ్రీనివాస్, టి పెద్దిరాజు, ఎంవి చలపతి, ఎంవి రమణ, కె నాగరాజు, పి శ్రీనివాసులు, డి రాజా రమేష్, కళాకారులు రంగా, శ్రీధర్, అనిఫ్, సీనియర్ నాయకులు సిహెచ్ అప్పారావు, జివి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జైలు వివాదంపై డిఐజి సీరియస్

- వార్డర్ సస్పెన్షన్
- 37 మందిపై క్రమశిక్షణా చర్యలు

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

విశాఖ కేంద్రకారాగారంలో వార్డర్లు ధర్నా చేసిన ఘటనపై రాష్ట్ర జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ సీరియస్ అయ్యారు. విధులకు హాజరు కాకుండా ధర్నాలో పాల్గొన్న 37 మంది జైలు వార్డర్లను వేరే జైళ్లకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో జైలు అధికారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వార్డర్ వాసుదేవరావును సస్పెండ్ చేశారు. ఖైదీల ఎదుట జైలు పర్యవేక్షణాధికారి మహేష్‌బాబు తమను దుస్తులు తొలగించి తనిఖీలు చేశారని, దీనిని అవమానంగా భావిస్తున్నామని చెప్పి వార్డర్లు జయకృష్ణ, శంభునాయుడు విధులకు హాజరు కాకుండా నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా మరో 35 మంది వార్డర్లు, వారి కుటుంబ సభ్యులు జైలు గేటు వద్ద శనివారం రాత్రి నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ విశాఖ కేంద్ర కారాగారానికి చేరుకొని ఘటనపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల కేంద్రకారాగారంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రక్షాళనలో భాగంగా కఠినంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. అనుమానం వస్తే ఎవ్వరినైనా తనిఖీలు చేయవచ్చని తెలిపారు. దీన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చేసిన వార్డర్లను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వివిధ జైళ్లకు అటాచ్ చేస్తున్నట్టు తెలిపారు. కేంద్రకారాగారంలో ఖైదీల సంఖ్య పెరిగిందని, వీరిలో సుమారు 200 మందిని వేరే జైళ్లకు పంపేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాటం సాగిస్తాం : టిఎన్‌టియుసి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

అల్లూరి స్ఫూర్తితో మరో పోరాటం సాగించి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని టిఎన్‌టియుసి నాయకులు బొడ్డు పైడిరాజు స్పష్టంచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1417వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పైడిరాజు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జీతాలు లేక స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. సంక్రాంతి దగ్గర పడడం, జీతాలు లేకపోవడంతో ఇళ్లల్లో ఎవరూ సంతోషంగా లేరన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తక్షణమే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల వేదిక రాజమహేంద్రవరం

- అభ్యుదయ, సాంఘిక పోరాటాల వారసత్వాన్ని కొనసాగించాలి
- సిపిఎం తూర్పుగోదావరి జిల్లా మహాసభలో మంతెన సీతారాం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం

అభ్యుదయ, సాంఘిక ఉద్యమాల వేదిక రాజమహేంద్రవరమని, ఈ వారసత్వాన్ని కొనసాగించడానికి ప్రస్తుత నాయకత్వం కంకణబద్ధులు కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని రౌతు తాతాలు కల్యాణ మండపంలో రెండు రోజులపాటు జరిగిన మహాసభ ఆదివారంతో ముగిసింది. తొలుత సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్ సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, పి.తులసి, బి.పవన్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి మంతెన సీతారాం మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలోనూ ఈ ప్రాంత ప్రత్యేకతను గుర్తు చేశారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వానికి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అవే విధానాలను అనుసరిస్తోందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందన్నారు. లాటిన్ అమెరికా దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉన్నాయని, చైనా, శ్రీలంకలో కమ్యూనిస్టులు ప్రజారంజక పాలన అందిస్తున్నాయని తెలిపారు.

భద్రాచలం మాజీ ఎంపి మిడియం బాబూరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ప్రణాళిక నిత్యనూతనమని అన్నారు. ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక ఒక దిక్సూచి అని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య వారసత్వాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి సర్కారు అదాని, అంబానిలకు సహజ వనరులను కారుచౌకగా దోచిపెడుతోందన్నారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రస్తుతం పాలకులు ప్రజలను మభ్యపెట్టి రాజకీయాలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన విజన్-2047 దీనిలో భాగమేనని తెలిపారు. ప్రజలను రాజకీయంగా స్థిరపర్చాలని, ఆ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ నివేదికను ప్రవేశపెట్టారు. సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, కెఎస్‌వి.రామచంద్రరావు, వై.బేబిరాణి, పి.తులసి, బి.పవన్, ఎన్ రాజా, సీనియర్ నాయకులు ఎస్ఎస్ మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టిఎస్.ప్రకాష్, ఐద్వా నాయకులు జరీనా, వెంకటలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా టి.అరుణ్



జిల్లా కమిటీ సభ్యులుగా 12 మంది ఎన్నికయ్యారు. నూతన కార్యదర్శిగా టి.అరుణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా జువ్వల రాంబాబు, బి.పవన్, తులసి ఎన్నికయ్యారు.

రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు

- కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, పి ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గానికి చెందిన రైతు కొమ్మర నాగేంద్ర కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడి మరణించిన ఘటన అందర్నీ కంటతడిపెట్టిస్తుందని తెలిపారు. అయినా అధికారంలో ఉన్న పార్టీని, ప్రభుత్వాన్ని కదిలించలేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం, ఎం లింగాపురం గ్రామానికి చెందిన రైతు చిమ్మె నడిపి మారెన్న ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒకమూల రైతులు, కౌలు రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణాలను అన్ని రకాల బ్యాంకులు మాఫీ చేయాలని, పంటలకు మద్దతు ధరలు ప్రకటించి కచ్చితంగా అమలు చేయాలని కోరారు. పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు తగ్గించేందుకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాల ధరలను అదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉచిత పంటల బీమా అమలు చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కరువు, తుపాను వంటి సందర్భాల్లో పంటల బీమా అమలు చేసేందుకు తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై రైతు సంఘాలు, రైతుల సమస్యలపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంఘాలతో రాష్ట్రప్రభుత్వం సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. వీటిని ఆచరణలో పెట్టి రైతుల ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు.

'అప్పా'కు కార్యరూపం

- స్థల సేకరణ పూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ఎట్టకేలకు ఎపి పోలీస్ అకాడమీ (అప్పా) కార్యరూపం దాల్చబోతోంది. ఇందుకు సంబంధించిన అడుగులు వేగవంతంగా పడుతున్నాయి. ఇందులో భాగంగా పోలీస్ అకాడమీకి శాశ్వత భవనాలు నిర్మించేందుకు వీలుగా స్థల సేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. ఆక్టోపస్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం కోసం ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం గొండపల్లి వద్ద 76 ఎకరాల భూమిని ఉన్నతాధికారులు కేటాయించారు. ఆయా భూములను ఈ నెల 26న డిజిపి ద్వారకా తిరుమలరావు సందర్శించారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (గ్రేహౌండ్స్) నిర్మాణ ప్రతిపాదన కోసం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి గ్రామంలో 498.23 ఎకరాల భూమిని సేకరించారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి శాశ్వత ప్రాతిపదికన పోలీస్ అకాడమీ లేకపోవడంతో అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పిటిసి)లో నూతనంగా ఎంపికైన ఎస్ఐ స్థాయి నుంచి ఆపై స్థాయి ఉద్యోగులకు శిక్షణ నిర్వహిస్తున్నారు. గ్రేహౌండ్స్‌కు శిక్షణ కేంద్రం లేకపోవడంతో విశాఖపట్నంలో తాత్కాలికంగా పోలీస్‌శాఖ నిర్వహిస్తోంది. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో పోలీస్ అకాడమీలో నూతన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేవారు. అక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు తదనంతరం పోస్టింగ్‌లు ఇచ్చేవారు. రాష్ట్ర విభజనతో అప్పా తెలంగాణ రాష్ట్రానికి వెళ్లిపోయింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత పోలీస్ అకాడమీ లేకుండాపోయింది. తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయి పదేళ్లు పూర్తయినప్పటికీ రాష్ట్రంలో శాశ్వత పోలీస్ అకాడమీ ఏర్పాటుకు నోచుకోలేదు. ఇటువంటి పరిస్థితుల్లో పోలీస్‌లు ప్రత్యేకంగా శిక్షణ పొందేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అప్పా త్వరలో కార్యరూపం దాల్చబోతుండటం పట్ల పోలీసు వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 కల్లా అప్పాకు సంబంధించిన భవనాల నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు సమాచారం. రాజధాని ప్రాంతం (సిఆర్‌డిఎ) పరిధిలో 2025 జనవరి 26న రిపబ్లిక్ డే (గణతంత్ర దినోత్సవం) జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే అంశాన్ని ఇటీవల జరిగిన పోలీస్ అమరవీరుల దినోత్సవం సభలో సిఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రస్తుతం ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.

బల్క్ డ్రగ్ కంపెనీ వద్దు

- హోంమంత్రి ఎదుట ప్లకార్డులతో మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)


మత్స్యకార యువకులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఆదివారం హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటిస్తుండగా గ్రామానికి చెందిన మత్స్యకారులు బల్క్ డ్రగ్స్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. మంత్రి అనితతో మత్స్యకారులు మాట్లాడుతూ కాకినాడ ప్రాంతంలో వ్యతిరేకించిన బల్క్ డ్రగ్ కంపెనీని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని, ఇక్కడ ఏర్పాటు చేస్తే సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న తామంతా రోడ్డును పడతామని, తమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలకు ఆమోదమైన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై హోంమంత్రి అనిత స్పందిస్తూ ఇక్కడ ఏ పరిశ్రమలు రాబోతున్నాయో ఇంకా స్పష్టత లేదన్నారు. ఎపిఐఐసి సేకరించిన భూములలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా అధికారులు సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే అధికారులు ఆ పనులు చేస్తున్నారని తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేసే ముందు గ్రామసభలు, ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించి పరిహారం, ప్యాకేజీ సమస్యను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు ఎం మహేష్‌బాబు, ఎం భయ్యన్న, అంజి, కె కాశీరావు, జి సోమేశ్వరరావు, సిహెచ్ సోమేష్, కె భూలోక, ఎం అప్పలరాజు, ఎం బాపూజీ, సిహెచ్ రాజు, వి శ్రీను, చొక్కా గోపి, బి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గొంతెండుతున్న మన్యం

- దరిచేరని కేంద్ర, రాష్ట్ర పథకాలు
- నత్తనడకన పనులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



రూ.వేల కోట్లు కేటాయిస్తున్నా... వేలాదిమంది సిబ్బంది ఉన్నా.. మన్యం గొంతెండుతోంది... గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంటోంది. ఓవైపు రహదారి సౌకర్యాలు లేక అనునిత్యం డోలీ కష్టాలు వెంటాడుతుండగా, మరోవైపు స్వచ్ఛమైన తాగునీటికి కూడా గిరిజనులు నోచుకోలేకపోతున్నారు. మంచినీటి కోసం కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో అరకొర నిధులు కేటాయిస్తున్నప్పటికీ వాటిని కూడా సక్రమంగా ఖర్చు చేయలేకపోతున్నాయి. దీంతో అనేక గిరిజన గ్రామాల ప్రజలు ఇప్పటికే ఊట నీటికి, చెరువులు, వాగుల్లోని నీటికే పరిమితమవుతున్నారు. దీనివల్ల అనేక వ్యాధులు కూడా ప్రబలుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

ఈ ఏడాది రాష్ట్రంలోని 9,934 గిరిజన ప్రాంతాల్లో తాగునీటి కోసం రూ.1,290 కోట్లతో పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ మొత్తం పనులను జల్‌జీవన్ మిషన్ ద్వారా చేయాలని ప్రతిపాదించారు. ఈ నిధులతో మొత్తం 12,838 పనులను గుర్తించి ప్రారంభించారు. వాటిని పూర్తి చేయడంలో మాత్రం ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఇప్పటి వరకు 5,718 పనులను మాత్రమే పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 2,582 పనులు పలు స్థాయిల్లో ఉండగా, 4,538 పనులను ఇంకా ప్రారంభించనేలేదు. మొత్తమ్మీద 20 శాతం మాత్రమే పనులు జరిగాయి. మొత్తం నిధుల్లో రూ.218 కోట్లను మాత్రమే ఖర్చు చేయగలిగారు.

నీటి వనరుల గుర్తింపులో అలసత్వం

గిరిజన ప్రాంతాల్లో తాగునీటిని అందించేందుకు ముందుగా నీటి వనరులను గుర్తించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో అలసత్వం, జాప్యం చోటుచేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఉన్న వనరుల నుంచి నీటిని స్వచ్ఛంగా మార్చడం కూడా సక్రమంగా సాగడం లేదన్న భావన వ్యక్తమవుతోంది. పనులపై వారానికోసారి సమీక్ష చేయాలని గతంలోనే నిర్ణయించినప్పటికీ అది కూడా అమలు కావడం లేదని తెలుస్తోంది.

గిరిజన గ్రామాల్లో తాగునీటి కల్పన వివరాలు

గుర్తించిన గ్రామాలు	9,934
చేపట్టిన పనులు	12,838
పూర్తయినవి	5,718
కొనసాగుతున్నవి	2,582
ప్రారంభం కానివి	4,538
మొత్తం ఖర్చు అంచనా	రూ.1,290 కోట్లు
చేసిన ఖర్చు	రూ.218 కోట్లు

సూక్ష్మ సేద్యంపై శీతకన్ను

- 40,452 హెక్టార్లకే అనుమతి
- ఇంకా పూర్తికాని దరఖాస్తుల ప్రక్రియ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



మెట్ట ప్రాంతాల్లో పంటల సాగుకు కీలకంగా ఉన్న సూక్ష్మ సేద్యంపై పాలకులు, అధికారులు శీతకన్నే శారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో భాగంగా 3 లక్షల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం పరికరాలు అమర్చి పంటలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా, ఇప్పటికీ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో లక్ష్యానికి మించి 3,18,418 హెక్టార్లకు రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పటివరకూ 1.18 లక్షల హెక్టార్లకు మాత్రమే అధికారులు ప్రాథమిక పరిశీలన పూర్తి చేయగా, 40,452 హెక్టార్లకు అనుమతులు మంజూరు చేశారు. పథకం అమలులో వెనుకబడిన జిల్లాల్లో మెట్ట ప్రాంతాలు అధికంగా ఉన్న అనంతపురంలో 37,500 హెక్టార్లకు 5,641, పొట్టిశ్రీరాములు నెల్లూరు 10,500 హెక్టార్లకు 1,637, వైఎస్ఆర్ కడప 31,500 హెక్టార్లకు 4,781, అన్నమయ్య 36 వేల హెక్టార్లకు 4,404, నంద్యాల 15 వేల హెక్టార్లకు రెండు వేల హెక్టార్లలో పరికరాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులిచ్చారు. మరోవైపు లక్ష్యాలు తక్కువగా ఉన్న అనకాపల్లి, పల్నాడు, ఎఎస్ఆర్, ఎన్‌టిఆర్, గుంటూరు, విజయనగరం, పశ్చిమగోదావరి, కృష్ణా, అంబేద్కర్ కోనసీమ, విశాఖపట్నంలలో చాలా తక్కువ సంఖ్యలో అనుమతులిచ్చినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. సూక్ష్మ సేద్యం పథకం కింద కేంద్ర ప్రభుత్వం కేవలం సన్న, చిన్నకారు రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం సబ్సిడీ మాత్రమే ఇస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన మొత్తాన్ని భరించి సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం వరకూ సబ్సిడీని కొనసాగిస్తుంది. మరోవైపు 2019కు ముందు ఈ పథకంలో దళిత, గిరిజన రైతులకు నూరు శాతం సబ్సిడీని అందించగా, గత వైసిపి ప్రభుత్వం సబ్సిడీని తొలగించి ఇతర రైతుల వలే 90 శాతం అందించింది. తొలుత దాదాపు మూడేళ్ల పాటు పథకం అమలును అటకెక్కించింది. చివరి రెండేళ్లలో మాత్రమే పథకం అమలుకు అనుమతినిచ్చింది. ఈ పథకం అమలు కోసం రూ.1,167 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేయగా, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.762.13 కోట్లు కేటాయించారు. ఇప్పటికే పరికరాలను సరఫరా చేసే సంస్థలకు రూ.176 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుల ప్రాథమిక పరిశీలనలు త్వరితగతిన పూర్తిచేసి, జనవరిలోపు అనుమతులు మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తేనే అనుకున్న లక్ష్యాలు సకాలంలో సాధించేందుకు అవకాశం ఉంది.

ఎంపిడిఒపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒ, దళితుడైన జవహర్‌బాబుపై దాడి చేసిన సుదర్శన్ రెడ్డి, గడ్డం చంద్రప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటరెడ్డి, భానుమూర్తిరెడ్డి, ధర్మారెడ్డి, ప్రభాకర్ తదితరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గాలివీడు ఎంపిడిఒగా జవహర్ బాబు విధి నిర్వహణలో ఉండగా కార్యాలయానికి తాళం వేయడమే కాకుండా ఆయనపై దాడి చేసి గాయపరచడాన్ని అత్యంత పాశవిక చర్యగా అభివర్ణించారు. ఎంపిడిఒ వల్ల ఏవైనా ఇబ్బందులుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దళిత, గిరిజనులపై దాడులు విపరీతంగా పెరిగాయని, వీటిపై స్పందించి న్యాయం చేయకపోవడంతోనే, ఇప్పుడు అధికారులపైనా దాడులకు దిగుతున్నారని అన్నారు. ఇప్పటికైనా దళిత, గిరిజనులతోపాటు, ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. దాడులు జరిగిన ప్రాంతాల్లో హోం, సాంఘికశాఖల మంత్రులు ఉమ్మడిగా పర్యటించి, బాధితులకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందనే భరోసా ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో సమస్యలపై పనిచేసే సంఘాలకు ప్రాధాన్యత ఇచ్చి భర్తీ చేయాలన్నారు.

థర్డ్ పార్టీ కాంట్రాక్టు వ్యవస్థ రద్దు

- ఎపిపిటిడి అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో థర్డ్ పార్టీ కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మేనేజ్‌మెంటే డైరెక్టుగా జీతాలు చెల్లించాలని ఎపిపిటిడి అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విజయవాడలోని లెనిన్ సెంటర్ రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి ముత్యాలరావు అధ్యక్షతన అసోసియేషన్ మొదటి వార్షికోత్సవ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ.. సీనియారిటీ ప్రకారం ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రోత్సాహక ఇంక్రిమెంట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎపిఎస్‌ఆర్‌టిసిని 2020లో ప్రభుత్వంలో విలీనం చేశారని, ఆర్‌టిసిలో థర్డ్ పార్టీ కాంట్రాక్టు వ్యవస్థలో పనిచేస్తూ దోపిడీకి గురవుతున్న సుమారు 8 వేలమంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆప్కాస్ సంస్థలో చేర్చాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ ఉద్యోగులకు చెల్లించే జీతాలు ఆర్‌టిసిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రెవెన్యూ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీతాలు పెంచి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జెఎసి ఛైర్మన్ కె సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు, ఎపి జెఎసి అమరావతి స్టేట్ మహిళా విభాగం సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, క్యాపిటల్ యూనిట్ ప్రధాన కార్యదర్శి మందపాటి శంకరరావు, ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి కుమార్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బుజ్జి, ఎ గజపతి పాల్గొన్నారు. వార్షికోత్సవం అనంతరం ఎపిపిటిడి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల 2025 టేబుల్ కేలండర్‌ను ఆవిష్కరించారు.

విఆర్ఒ పోస్టులను భర్తీ చేయాలి

- ఎపి విలేజ్, రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,200 విఆర్ఒ గ్రేడ్-1 ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, విఆర్ఒలపై ఇతర శాఖల అధికారుల పెత్తనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపి విలేజ్, రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రవర్మ, ఎం అప్పలనాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో బయోమెట్రిక్ ద్వారా జీతాల చెల్లింపులపై ఆ శాఖ డైరెక్టర్ ఇచ్చిన మెమోను తక్షణం ఉపసంహరించాలని కోరారు. ఎపి ఎఫ్ఆర్ఎస్‌లో విఆర్ఒలు బయోమెట్రిక్ వేసుకునే విధంగా సిఎస్ గతంలో ఉత్తర్వులిచ్చారని, వాటిని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా అర్హులైన విఆర్ఒలతో వెంటనే భర్తీ చేయాలని, గతంలో పనిచేస్తున్న విఆర్ఒలకు కేటాయించిన 40 శాతం రేషియోను 70 శాతానికి పెంచుతూ జిఓ నెంబరు 154కు అమెండ్‌మెంట్ చేసి అన్ని అర్హతలున్న విఆర్ఒలతో భర్తీ చేయాలని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు దశల వారీగా విడుదల చేయాలని, ఐఆర్ ప్రకటించి వెంటనే పిఆర్‌సి కమిషన్ వేయాలని, పెండింగ్ డిఎలు విడుదల చేయాలని వారు కోరారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 15 వేలమంది గ్రేడ్-1, గ్రేడ్-2 విఆర్ఒలకు కామన్ డిడిఒగా తహశీల్దార్ ఉండేలా వెంటనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నూర్పిడి యంత్రం బోల్తా.. బాలుడు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి (విజయనగరం జిల్లా)

వరి నూర్పిడి యంత్రం బోల్తా పడి బాలుడు మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గున్నతోటవలస గ్రామానికి చెందిన సాలపు శంకర్, పొలమ్మ దంపతులు గ్రామ సమీపంలోని మహారాణితోట ఎదురుగా ఉన్న పొలంలో ఆదివారం వరి నూర్పిడి పనులకు వెళ్లారు. వారి వెంట కుమారులు మణికంఠ (14), పార్దులను తీసుకువెళ్లారు. నూర్పిడి పూర్తవడంతో పిల్లలను అమ్మమ్మ వద్ద ఉంచి దంపతులు మరో పొలానికి వెళ్లారు. నూర్పిడి యంత్రాన్ని ఇంటికి తీసుకువెళ్తుండగా మణికంఠ, పార్దుతోపాటు మరో బాలుడు ఆ యంత్రంపైకి ఎక్కారు. నూర్పిడి యంత్రం గట్టు ఎక్కుతుండగా బోల్తా పడింది. దీంతో యంత్రం కింద పడి మణికంఠ మరణించాడు.



కత్తుల దారుల్లో కాలం వంతెనపై
కవిత్వం అల్లేవాడే కవి. మారే
కాలం కోసం మార్చే మనుషుల కోసం
కవిత్వం కూర్చేవాడే కవి.
- శ్రీశ్రీ



కొత్త వెలుగుల పంట

అన్నా..
కొత్త సంవత్సరం వచ్చిందంటే
కోటి చుక్కల్ని తెంపి కళ్ళల్లో నింపుకుంటావ్
కొత్త కోర్కెల్ని తెచ్చి
గుండెల్లో వొంపుకుంటావ్!
రంగు రంగుల ముగ్గుల్ని
రుతువుల మాగాణం నిండా
చక్కని మొక్కలుగా అలంకరించుకుంటావ్!
వెండి జిలుగుల మబ్బుల్ని
కళ్ళం నాపరాయి నిండా
కలల కంకులుగా కుప్పలు పేర్చుకుంటావ్!

నిజానికి అప్పుడాక్షణం
ఏ తర్కబద్ధ ఆలోచనా
నీ మెదడు నారుమడిలో మొలకెత్తదు
మారే కాలానికి బతుకుల్ని
మార్చేంత మహత్తు ఉండదన్న వాస్తవం
నీ జ్ఞానేంద్రియాలకు స్ఫురించదు!

కానీ, కనిపిస్తున్న
కఠిన వాస్తవం అదే కదా అన్నా!
కాలం మూగది
ఎవ్వరినీ ఏమీ అనలేనిది
ఏ భావోద్వేగాలకూ లొంగని
మౌన గడియారంలో ముల్లు లాంటిది!

చేతికొచ్చిన చెమటపంట నోటికందకుండా
ప్రకృతి లాక్కుపోతేనో
కుట్రల గుంటనక్కలు కాపుకాసి తన్నుకుపోతేనో
కాపాడలేదని కాలాన్ని నిందిస్తే
కలిగే ప్రయోజనం ఏముంటుంది చెప్పు!
జీవితం ఎప్పుడూ
కాలం ఒళ్ళోంచి వూడిపడదు!
కాలం నీ గాయాలను మాన్పే
గ్యారంటీ కార్డు కాదు కదా!

కారణాలు పసికట్టి
బతుకు పోరాటంలో
యుద్ధ తంత్రాన్ని మార్చాల్సిందే!
శతాబ్దాలుగా నువ్వు నడుస్తున్న దారి
గుంటలు పడి మురుగునీరు చేరి
అడ్డమైన బురద పందులూ దొర్లుతున్నప్పుడు
నీ కార్యాచరణ కాలి బాటను
చిన్న చిన్న మరమ్మతులు చేస్తే సరిపోతుందా?
చైతన్యవంతమైన కొత్త రోడ్డును
మళ్ళీ నిర్మించుకోవలసిందే!
కొత్త వెలుగుల పంట నోటికందాలంటే
అడ్డగాడిదలు దూరలేని
గట్టి కంచెల నిర్మాణానికి
పట్టు సడలకుండా పోరు సలపాల్సిందే!

- పతివాడ నాస్తిక్
9441724167

ములాఖత్

అందరూ గుమిగూడి వున్నారు
ఒకటే మాటల రొద
కొందరు ఏడుస్తున్నారు
కొందరు నవ్వుతున్నారు
కొందరు కదలకుండా
ఒకరి చేతి వేళ్ళలోకి
ఒకరు భారంగా వేలాడుతూ
కళ్ళతో మాటాడుకుంటున్నారు
కూతుళ్లు కొడుకులు
మనుమలు కొంతమంది
భుజాలపై నుండి లోపలకి
తొంగి చూస్తున్నారు
కళ్ళన్నీ ఆర్తిగానో ఆవేదనగానో
మాట్లాడుతున్నాయి
ఏమీ వినిపించదు
నీటి పొరల వెనక
నిరీక్షణ ఏదో మింగేస్తూ వుంది
ఆ హృదయాలను
చీల్చి అడ్డుగా నిలుచున్న
ఇనుప తెరకు దుఃఖమొస్తుంది
ఇదంతా ఏళ్లుగా వింటూ
కానీ టక్ టక్ మని వెనక్కి నెడుతున్న
ఆ లాఠీకి మాత్రం
ఏమీ కనిపించదు వినిపించదు!

- కెక్యూబ్ వర్మ
9493436277

ఏదైతేనేం కవిత్వానికి!

చాలా సేపు నుంచి వెతుకుతున్నా
కావాల్సింది కనబడడం లేదు
ఇరకా మరకా అన్నీ వెతుకుతున్నా
దొరికినవే మళ్ళీ మళ్ళీ దొరుకుతున్నాయి
పాడుబడ్డ నుయ్యి, కప్పేసిన గొయ్యి
గొడ్ల కొట్లు, పందుల దొడ్లు
ఆర్పేసిన గూటి, కాల్చేసిన కాడి
కిందా మీదా తిరగేసి వెతుకుతున్నా
కావాల్సింది దొరకడం లేదు!

నాగలి సాలు వెంట
పట్టీ కొట్టిన పొలమంటా
ఎద్దుల బండి జాడెనక
ఆవుల డెక్కల అడుగంటా
అంతా ఎగాదిగా వెతికేసా
పేడలు ఎగదోసి, గడ్డి పరకలు కలబోసి
గంపలు ఎకేసి, తట్టెలు తిరగేసి
రానూ పోనూ అంతా వెతికేసా!

మెదడు మొరాయించిందో
మనసే మొద్దుబారిపోయిందో
ఇక దొరకదేమోనని
వదిలేద్దామనుకుంటున్నప్పుడు
బండరాయిపై మొలసిన మొక్క
కనువిప్పు కలిగించింది
మోడుబారిన హృదయానికి
రాయడానికి దిక్కై నిలిచింది
ఏదైతేనేం కవిత్వానికి
కావాల్సింది హృదయమే గదా!
ఇప్పుడు వెనుదిరిగి చూసుకుంటే
అన్నీ కావాల్సినవై కనిపిస్తున్నాయి!

- వినోద్ కుత్తుం
9634314502

వెంటాడే మాధుర్య గానం


సందర్భం

1950-70 మధ్యకాలంలో సినీ సామ్రాజ్యాన్ని ఏలిన పాటల చక్రవర్తి మహమ్మద్ రఫీ. ఒక రకంగా అది రఫీయుగమే అని సంగీతాభిమానులు ఘంటాపథంగా చెప్పుకుంటారు. ఎందరో గాయకులు వచ్చారు. కాని కొందరే చరిత్ర సృష్టిస్తారు. అజరామరమైన గొంతుతో పదమూడేళ్ళ వయస్సులోనే వేదికలో అద్భుతంగా పాట పాడి సభికులను అబ్బురపరచిన మహాపాటల మాంత్రికుడు రఫీ. పంజాబ్ రాష్ట్రంలో కోట్లా సుల్తాన్ పూర్‌లో జన్మించారు. అది ప్రస్తుతం అమృతసర్ జిల్లాలోని వుంది. 24 డిసెంబర్ 1924లో జన్మించిన మహమ్మద్ రఫీ హిందుస్థాని, క్లాసికల్ సంగీతాన్ని ఉస్తాద్ బడే గులాం అలీఖాన్, ఉస్తాద్ అబ్దుల్ వహీద్ ఖాన్, పండిట్ జీవన్‌లాల్ మట్టూ మరియు ఫిరోజ్ నిజాంల వద్ద నేర్చుకున్నారు.

భారతదేశంలో కోట్లాదిమంది సంగీతాభిమానులకు ప్రీతిపాత్రుడైె హిందీ పాటలబాణిలను అలవోకగా అవలీలగా పసిగట్టి, ఏ హీరో గొంతుకు ఆ గొంతు సరిపోయేలా పాడిన మాధుర్యమైన గొంతు తనది. చిన్నప్పుడు తన మామ హమీద్‌తో పాటు అప్పటి సుప్రసిద్ధ గాయకులు కేయల్ సెహగల్ గాన కచేరి చూసేందుకు వెళ్ళాడు. ఆ రోజు విద్యుత్ అంతరాయం వల్ల కేయల్ సెహగల్ పాడనన్నాడు. రఫీ అదే వేదికపై పాడతానని తన మామయ్యతో చెప్పడంతో నిర్వాహకులతో మాట్లాడి రఫీ పాడేందుకు అనుమతి పొంది పాడించారు. పదమూడేళ్ళ వయసులో అంత మధురంగా పాడిన రఫీ గాత్రాన్ని ప్రత్యక్షంగా చూసిన కేయల్ సెహగల్ వేదికలో అందరి ఎదురుగా రఫీని ఎత్తుకుని ముద్దాడి ఈ బాలుడు భవిష్యత్తులో గొప్ప గాయకుడవుతాడని కితాబిచ్చాడు. ఆ కచేరికి హాజరైన శ్యాంసుందర్ అనే ప్రఖ్యాత సంగీతకారుడు రఫీని గుర్తుపెట్టుకుని సినిమాలో గుల్‌బలోచ్ (1942)లో జీనల్ బేగంతో తోడుగా పాడే అవకాశం కల్పించారు. ఆ తరువాత తనకు పంజాబి సినీ పరిశ్రమలో ఎన్నో అవకాశాలొచ్చాయి. 1945లో హింది చిత్రం గ్యాన్ కి ఘోరి చిత్రంలో పాడిన పాటలు మొదలు ప్రస్తుతం బాలీవుడ్ గాచెప్పుకునే ఆనాటి హిందీ సినీ పరిశ్రమలోని ప్రముఖ సంగీత దర్శకులు నౌషద్, ఎస్‌డి బర్మన్ శంకర్ జైకిషన్, రవి, మదన్ మోహన్, ఓపినయ్యర్, లక్ష్మీకాంత్ ప్యారేలాల్, మన్నాడే తదితరులందరి సంగీత సారథ్యంలో పాడారు.

రఫీ గొంతులో తెలుగు మధురం

అజరామరమైన గాయకుడైన రఫీ మంచి బ్యాడ్‌మింటన్ క్రీడాకారుడు కూడా. ప్రతి ఉదయం బ్యాడ్‌మింటన్ ఆడనిదే రఫీ దినచర్య మొదలవ్వదు. తన గొంతుతో స్వరాలను, శృతులను గొప్పగా పలికించే శ్రావ్యమైన గాత్రం. మొదటిసారిగా తెలుగు సినీ పరిశ్రమకు మహమ్మద్ రఫీ గానాన్ని జగ్గయ్య పరిచయం చేశారు. 1964లో చిత్తూరు నాగయ్య నటించిన భక్త రామదాసు చిత్రంలో కబీరు పాత్రధారిగా




నటించిన గుమ్మడి పాత్రకు కహేకరోనా, రామ్‌నామ్‌సే జ్యాదా అంటూ నేపథ్యగానం చేశారు. ఆ పాటలను రఫీతో పాడించాలని నిర్మాత అనుకుంటుండగా ఆ విషయం తెలుసుకున్న రఫీ స్వయంగా తన సొంత ఖర్చులతో వచ్చి పాడి రికార్డింగు చేసి వెళ్ళిపోయారు. 1969లో ఎన్టీయార్ నటించిన భలే తమ్ముడు (1969) లో పాడిన పాటలు సంచలనాలయ్యాయి. ఉత్తర భారతదేశానికి చెందిన మహమ్మద్ రఫీ సాబ్ గొంతుకు తెలుగు ప్రజలు జేజేలు పలికారు. ప్రసిద్ధ నేపథ్య గాయని పి.సుశీలతో 'ఇద్దరి మనసులు ఒకటాయే సరిహద్దులు లేనే లేవాయే' అంటూ.. 'ఎంత వారు గాని వేదాంతులైన గాని వాలు చూపు సోకగానె తేలిపోదురే...' అని అతి మధురంగా పాడి.. 'గోపాలబాల నిన్నే చూసి..' అంటూ కొంటెగా కవ్వించి.. 'నేడే ఈనాడే కరుణించె నన్ను చెలికాడే..' అంటూ ప్రణయలోక మాధుర్యాన్ని తన గాత్రంతో తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకున్నారు. తన గాత్రానికి సినారె రాసిన ఆ గేయాలు తెలుగునాట పదికాలాలు నిలబడేలా వారిద్దరి కాంబినేషన్ చరిత్ర సృష్టించింది. 1974లో తీసిన రామ్ రహీం సినీమాలో హిందీ భాషలోనూ గొప్ప పాండిత్యమున్న ప్రముఖ కవి దాశరథితో పాటను రాయించారు. దాశరథి రాసిన నేను కత్తుల రత్తయ్యనులే పాటను.. యునాని హకీన్ హూ.. అంటూ మరో పాటను రఫీసాబ్ పాడారు. 1976లో ఎన్టీయార్ నటించిన ఆరాధన చిత్రంలో మరపురాని, మరువలేని, మధురమైన పాటలను పాడి తెలుగు సినీ జగత్తు గుర్తు పెట్టుకునేలా పాడి అలరించారు. ఆ సినిమాలోని పాటలన్నీ ఆణిముత్యాలే. ఈ సినిమాకు ఎస్.జానకమ్మ గొంతుతో శృతికలిపిని రఫీసాబ్ నేడే తెలిసింది ఈనాడే తెలిసింది అని..ఓ ప్రియతమా నామది నిన్ను పిలిచింది గానమై... అంటూ పాడిన పాటలు నేటికి ఎవ్వరూ మరచిపోలేరు. ఆ పాటలొచ్చాయంటే చాలు; నేటికీ ఎఫ్‌ఎంలోనైనా, టీవిల్లోనైనా అట్టే అతుక్కు పోతారు. యన్టీయార్ దర్శకత్వం వహించిన అక్బర్ సలీం అనార్కలి (1979)లోని పాటలన్నీ సూపర్ హిట్సే. మళ్ళీ సుశీలమ్మతో కలసి కలుసుకున్నా గుబులాయే.. కలవకున్నా దిగులాయే అంటూ ప్రేమ గీతాన్ని ఎంతో శ్రావ్యంగా ఆలపించారు రఫీ. రేయి ఆగిపోని రేపు ఆగిపోని ఈ ప్రేమ వాహిని ఇలా కరిగిపోని.. అంటూ మరో పాటను.. సిపాయి.. ఓ సిపాయి అంటూ యద తలపులు తట్టి.. తానే మేలి ముసుగు తీసి.. అంటూ ప్రేమ సంద్రంలో ఓలలాడించారు. అదే ఏడాది శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం సినిమాలో దేవుడు ఒక్కడే అంటూ ఆధ్యాత్మికంగా పాడి ఆశ్చర్యపరిచారు. కోవెల ఎరుగని అని పాడినా.. శరభి కళ్ళతో అని కవ్వింతగా ఆలపించినా.. నువ్వు నవ్వుతున్నావని లౌల్యంగా పాడినా రఫీకే చెల్లింది. 17 భాషల్లో సుమారు 28 వేల పాటలు మహమ్మద్ రఫీ పాడాడంటే మామూలు విషయం కాదు.

హిందీలో రఫీ కాంబినేషన్‌లో ఎక్కువగా పాడిన గాయని లతా మంగేష్కర్. హిందీలో అగ్రహీరోలందరికీ ఎవర్‌గ్రీన్ హిట్ సాంగ్స్ పాడారు. యాదోంకి బరత్‌లోని పాట చురాలియా నేటికి ఏ పాటల కార్యక్రమం జరిగినా పాడకుండా వుంటారా? యన్టీయార్‌కు ఆయన నటవారసులు నందమూరి హరికృష్ణ, నందమూరి బాలకృష్ణకు పాటలు పాడిన ఘనత ఆయనది. హరికృష్ణకు తల్లా పెళ్ళామా చిత్రంలో పాడారు. ఒకసారి కడప అమీన్ పీర్ దర్గాను సందర్శించారు. జోరున వాన పడుతుండగా మీరు అందరూ నా గాత్రం వింటానంటే వర్షం కూడా నా గొంతుకు జత కలుస్తుందని బహిరంగంగా ప్రకటించారు. ఆ మాటకు జనం సరే ననడంతో ఖవ్వాలి పాడి వినిపించారు.

1948 స్వాతంత్ర్య వేడుకల్లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా రజత పతకం అందుకున్న గాయకులు మహమ్మద్ రఫీ. తన సంగీత స్వరజీవితంలో ఎన్నో సత్కారాలు, సన్మానాలు, అవార్డులు పొందిన ఘనత మహమ్మద్ రఫీది. సినీ నేపథ్య గాయకులుగా 2 జాతీయ అవార్డులు, 6 ఫిలిం ఫేర్ అవార్డులు, 3 బెంగాల్ ఫిలిం జర్నలిస్ట్ అసోషియేషన్ అవార్డులు, యేహన్, సుర్ శింగార్ అవార్డుతో పాటు 1967లో భారత ప్రభుత్వం చేత ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ ఉన్న సమయంలో కూడా ఆయన కోసం ప్రత్యేకంగా పాటలు రాయించి, పాడించి ఆయా సందర్భాలకనుగుణంగా వారి వారి చిత్రాల్లో పాటలు పెట్టించిన నిర్మాతలున్నారంటే మామూలు విషయం కాదు. తన గొంతుతో అతి మధురంగా పాడే మహమ్మద్ రఫీ చక్కెర వ్యాధితో బాధ పడ్డాడు. దేశం గర్వించ దగ్గ గాయకుడు మహమ్మద్ రఫీ మధురస్వరం 31 జూలై 1980న శాశ్వతంగా మూగబోయింది! సంగీత ప్రపంచం ఉన్నంతకాలమూ ఆయన మధుర గానం కొనసాగుతూనే ఉంటుంది.

- కెంగార మోహన్

జానపద పరిశోధకులు డాక్టర్ తంగిరాల



జానపద సాహిత్య పరిశోధకుల, సాహిత్య సేవకులు డాక్టర్ తంగిరాల వెంకట సుబ్బారావు 90 సంవత్సరాల వయసులో కూడా తెలుగు సాహిత్యానికి అపురూప సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా జానపద సాహిత్యంలో కనుమరుగవుతున్న వీరగాథలను వెలికితీయటంలో ఆయన కృషి ప్రత్యేకమైనది. 1905లో నందిరాజు చలపతిరావు రచించిన స్త్రీల పాటలను 120 సంవత్సరాలు తర్వాత 'స్త్రీల పాటలు' సమగ్ర సంపుటిగా ఈ ఏడాది అక్టోబర్‌లో 1032 పుటలతో రాయల్ బైండింగ్ సైజులో ముద్రించారు. సాహిత్య అభిమానులు ఆర్థిక సహకారం అందించినా అందించకపోయినా తనకొచ్చే పెన్షన్‌తో పాటు కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ముద్రించి పంపిణీ చేయడం ఆయన తపనకు నిదర్శనం. డాక్టర్ తంగిరాల సాహిత్య సేవకు గుర్తింపుగా అజో-విభొ- కందాళం ఫౌండేషన్ ప్రకటించిన ప్రతిభామూర్తి పురస్కారాన్ని విజయవాడలో జనవరి 5 తేదీన జరగనున్న కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు.

తంగిరాల వెంకట సుబ్బారావు 1935 మార్చి 30 తేదీన జన్మించారు. వీరి స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకా కాకులు ఇల్లిందలపర్రు. తల్లిదండ్రులు సీతామహాలక్ష్మి, వెంకట సుబ్బావధానులు. ప్రాథమిక విద్య స్వగ్రామంలోను, పాఠశాల విద్య రాజమండ్రిలోను, భీమవరంలో ఇంటర్మీడియట్, బిఎ చదివారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఏ తెలుగు చదివి, అక్కడే 'తెలుగు వీర గాథా కవిత్వం'లో పీహెచ్‌డి పట్టా తీసుకున్నారు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయన దేవరకొండ బాలగంగాధర్ తిలక్‌కు ప్రియ శిష్యుడు. డిగ్రీ పూర్తయిన తర్వాత ఆరు సంవత్సరాలు తపాలా శాఖలో చిరు ఉద్యోగిగా పనిచేశారు. ఈయన కోరిక మేరకే 'మై డియర్ సుబ్బారావు కనిపించడం మానేశావు' అంటూ తిలక్ 'తపాలా బంట్రోతు' కవిత రాశారు. తిలక్ గారికి ప్రియ శిష్యుడుగా 'రసగంగాధర తిలకం' అనే పేరుతో కవితలను, ఆలోచనలు కలిపి సమగ్రంగా ప్రచురించారు. తపాలా శాఖ ఉద్యోగం అనంతరం రక్షణ శాఖలో ఇంజనీర్ పనిచేస్తున్న.తన సోదరుడు కష్ణమూర్తి ఆర్థిక సహకారంతో ఉన్నత విద్య కొనసాగించారు. 1963- 68 మధ్య కాలికి బలపం కట్టుకొని రాష్ట్రంలోని పలు గ్రామాల్లో తిరిగి వీరగాథలను సేకరించారు. కాటమరాజు కథలు, పల్నాటి వీరగాథలు సేకరించి గ్రంథస్థం చేశారు. కాటమరాజు కథలు మొత్తం 32 కథలు ఉండగా, మొదట్లో 20 కథలను రెండు విభాగాలుగా ప్రచురించారు. కాటమరాజు కథలు 3 పేరుతో మరో ఆరు కథలను ప్రచురించారు. మరో ఆరు కథలు నేటికీ లభ్యం కాలేదు. అవి ఎవరి దగ్గర ఉన్నా తనకు అందిస్తే సొంత ఖర్చులతో ముద్రిస్తానని ఈ వయసులో కూడా ఆయన తపన పడుతున్నారు.

డాక్టరేట్ అనంతరం ఆయన 1969లో బెంగళూరు యూనివర్సిటీలో కన్నడ శాఖలో తెలుగు ఉపన్యాసకులుగా చేరారు. బెంగళూరులో తెలుగు శాఖను ఏర్పాటు చేయాలని 1971లో నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పివి నరసింహారావు గారికి ఒక లేఖ రాశారు. స్పందించిన పీవీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందించిన రూ.3 లక్షల నిధులతో బెంగళూరు యూనివర్సిటీలో తెలుగు స్నాతకోత్తర శాఖను 1974లో ఏర్పాటు చేశారు. అదే యూనివర్సిటీలో సేవలు అందించిన తంగిరాల తెలుగు శాఖ అధిపతిగా 1992లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన అనేక గ్రంథాలు రచించారు. పలు పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. తన విశిష్ట సేవలకు గానూ పలు సత్కారాలు, సన్మానాలు, పురస్కారాలు అందుకున్నారు. తంగిరాల వారికి ఆధునిక కవిత్వం, జానపద కవిత్వం, తులనాత్మక సాహిత్యం, ప్రాచీన సాహిత్యం, కవి పండిత గోష్ఠి, సాహిత్య సభల నిర్వహణ, గ్రంథాల ప్రచురణ ఇష్టమైన వ్యాపకాలు. 91వ సంవత్సరంలోకి అడుగిడుతున్న ఆయన ఆయన గుంటూరు శేషేంద్ర శర్మ రచనలను సేకరించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ప్రతిభామూర్తి పురస్కారం అందుకుంటున్న సందర్భంగా ఆయనకు అభినందనలు.

- పావళ్ళ మహేష్
94906 88657

కవుల మానసిక సంస్కారాల అంచనా

పుస్తకం

ఇప్పటికే సాహిత్య లోకంలో కవిగా, కథకునిగా తనదైన ముద్రతో ముందుకు సాగుతున్న ఎమ్వీ రామిరెడ్డి, ఇప్పుడు సాహిత్య విమర్శలోనూ తన శైలి ప్రదర్శిస్తున్నారు. తాజాగా విస్తార, ప్రస్తార పేరిట రెండు సాహిత్య విమర్శన గ్రంథాలు వెలువరించారు. ఆయన వీటిని సహృదయంతో సమీక్షా వ్యాసాలు అన్నారు. కానీ ఇవి విమర్శనాత్మక వ్యాసాలు. విమర్శలో భేదాలకు సంబంధించి అభినందనాత్మక విమర్శ కూడా ఒకటి. 'విస్తార' వ్యాసాల్లో వారు దాదాపు ఒక కవికి సంబంధించి ఒక కవితా సంపుటిలోని రచనలను విశ్లేషించారు. ఇట్లాంటి విశ్లేషణను వివరణాత్మక విమర్శ అని కూడా అనవచ్చు. ఆయా కవుల రచనల్లోని కళాత్మక విలువలు, అందులోని వస్తువు, వారి మార్గాలకు ఆయన వాహకంగా మారి, మనలోకి ప్రవేశిస్తున్నారు. కవుల కళాత్మక రూపాన్ని గురించిన ఆత్మల వ్యక్తీకరణగా ఈ వ్యాసాలను పరిగణించవచ్చు.

ఇందులో ఆయన ఎంచుకున్న 26 కవిత్వ సంపుటాలకు సంబంధించి వ్యాసాలు ఉన్నాయి. ఆ పుస్తకాలని ఏదో పైపైనే చదివేసి హడావుడిగా నాలుగు వాక్యాలు రాసేయలేదు. ఆ కవులు తనని మెచ్చుకోవాలనే కాంక్ష కనబడలేదు. వారి నుంచి తక్షణలబ్ధి పొందాలని రాయలేదు. ఈ వ్యాసాలలో ఎక్కడా తీర్పులు ఇవ్వలేదు. అంచనా కట్టారు. నిర్ణయాత్మక విమర్శలో సిద్ధాంత ప్రతిపాదనలు లక్ష్య లక్షణ నిర్దేశాలు ఉంటాయి. ఈ వ్యాసాల్లో ఆయన అట్లాంటి ప్రయత్నం చేయకపోయినా ఫార్మటివ్ అస్సెస్మెంట్ చేశారు.

యార్లగడ్డ రాఘవేంద్రరావు 'పచ్చికడుపు వాసన' కవిత్వ సంపుటిపై ఆయన పరిశీలన చూడండి : "రాఘవేంద్రరావు కవిత్వ శైలి తనకంటూ ప్రత్యేక ముద్రను సొంతం చేసుకుంది. ఆయన కవిత్వంలో సుదీర్ఘ వాక్యాలు ఉంటాయి. ఈ ధోరణిలో ప్రవాహవేగం దెబ్బతినే అవకాశం ఉంది. కొనసాగింపు శ్రుతి తప్పే ప్రమాదం ఉంది. వాక్యాల మధ్య బంధం పెళుసుబారి, పాఠకుడు దారి తప్పే ప్రమాదమూ ఉంది. కానీ, యార్లగడ్డ కవిత్వంలో ఆ లోపాలు మచ్చుకైనా కనిపించవు. పైగా ఆ సుదీర్ఘ ధారే ఆయన కవిత్వానికి ట్రంప్ కార్డ్".

రామిరెడ్డి గారికి పాపినేని శివశంకర్ అంటే గొప్ప ఇష్టం. ఆయన కవిత్వం మీద రాసిన రెండు వ్యాసాలు ఇందులో ఉన్నాయి. ఆ రెంటిలోనూ శివశంకర్‌ని భిన్నంగా జమకట్టారు. 'రజనీగంధ'లో శివశంకర్ తాత్విక పరిశోధన సుగంధం అయితే, 'లోయలూ శిఖరాలూ'లో భూమిపుత్రుణ్ణి భుజాలపై మోసే కవిగా చూపుతున్నారు. 'తీసుకున్న వస్తువు ఏదైనా లోతుల్లోకి ఎలబారి దాని మూలాలను అందిపుచ్చుకొని అక్కడ కవితా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు' అంటూ శివశంకర్ గారి కవిత్వ నిర్మాణ రహస్యాన్ని చెప్తారు. శివశంకర్ గారి కవిత్వంలో 'ముగింపులు మనల్ని వెంటాడతాయని, లోపల ఎక్కడో అగ్ని ముట్టించి, మనల్ని కూడా వెలిగిస్తాయని, ఆలోచింప చేస్తాయని' ప్రకటిస్తారు.

తన మరో అభిమాన కవి శివారెడ్డి గారి గురించి రాసిన రెండు వ్యాసాల్లోనూ విభిన్నత పాటించారు. "ఉనవ్ శీ శ్రీశీజవ అను ప్రేమగీతం" కవితా సంపుటిలోని ప్రత్యేకతను ఇలా గమనించారు : "శివారెడ్డి కవిత్వానికి, తాజా కంఠానికి స్పష్టమైన తేడా కనిపిస్తుంది. అత్యంత సాదాసీదా పదాలతో, వాక్యాలతో ప్రారంభమయ్యే కవిత అంతే సరళంగా నడుస్తున్నట్లు కనిపిస్తుంది కానీ హఠాత్తుగా ఆ నడకలో ఒక అబ్బురపరిచే భంగిమ ప్రత్యక్షమవుతుంది. ఊహించని వ్యక్తీకరణ మనకు



ఊపిరాడకుండా చేస్తుంది. చుట్టుముట్టిన ఆలోచన్ల తుపానులోంచి ఎట్లా బయటపడాలో అర్థంగాక అట్లా ఆ పేజీలోనే గడ్డకట్టుకు పోతాం. అసలు కవిత్వం చేయాల్సిన పని అదే కదా" అని గుర్తుచేస్తారు. శివారెడ్డి కవిత్వాన్ని 'అనంత కాలాల ఆత్మజ్ఞానం'గా వర్ణించటం మామూలు మాట కాదు. రామిరెడ్డి వచనం అద్భుతంగా ఉంటుంది. కవిత్వాన్ని విశ్లేషించే సందర్భంలో హఠాత్తుగా ఆయనలోంచి కూడా కవి తొంగిచూస్తాడు. ఆ మాటలు వ్యాసం నడకకు అడ్డు తగలకపోగా మనల్ని మరింత ముందుకు తీసుకెళ్తాయి. శివారెడ్డి గారి ఎత్తుగడ గురించి రామిరెడ్డి పరిశీలన చూడండి : "రక్తపరీక్షలు, ఎక్సరేలు, స్కానింగ్‌లు గట్రా పూర్తి చేసి ఆనక తీరిగ్గా శస్త్రచికిత్స చేసే రకం గాదు ఈయన. ఎత్తుకోవటం ఎత్తుకోవటమే కత్తులు దూస్తాడు. ఆ ఎత్తుగడ ముందు ఎనస్తీషియా బలాదూర్. ఠపీమని ఓ మొట్టికాయ వేసి మనల్ని అమాంతం తనలోకి లాక్కెళ్తాడు. అక్షరాల సుడిలోకి ఈడ్చుకెళ్తాడు".

బండ్ల మాధవరావు గారి "దృశ్య రహస్యాల వెనుక" గురించి రాసిన వ్యాసంలో వాక్యాన్ని ఎలా పరుగుపెట్టించాడో చూడండి : 'మాధవరావు కవిత్వం లలితంగా ఉంటుంది. సరళంగా సాగుతుంది. తేలికైన పదాల పొందికతో వాక్యాలు పరుగులు తీస్తాయి. లేగదూడల్లా గెంతుతాయి. కళ్ళంలో గింజల్లా రాలుతాయి. అట్లా అని ఆయన సంధించిన అక్షరం నంగిగా మూలగదు. విధేయంగా ఉండదు. వంగి వంగి నడవదు. నక్కినక్కి చూడదు. ధీమాగా గొంతు విప్పుతుంది. ప్రశ్నిస్తుంది. గర్జిస్తుంది. నిటారుగా నడుస్తుంది."

• • •

ఈ వ్యాసాలకు చదివించే గుణం అపారంగా ఉంది. రామిరెడ్డి గారికి భాష మీద పట్టు, నుడికారం మీద అధికారం పుష్కలంగా ఉన్నట్లు ఏ వ్యాసాన్ని చదివిన ఇట్టే అర్థమైపోతుంది. ఆయా కవుల కవితా సంపుటాలను విశ్లేషించే క్రమంలో వారు సమకాలీన అంశాల పట్ల, విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాల పట్ల- జీవనమూలాల శైథిల్యం, సామాన్యుడి నైరాశ్యం, రాజకీయ అరాచకం, సంక్షోభాలు, ఆధునిక మానవ జీవనం మొదలైన వాటి గురించి తనదైన చూపుతో మాట్లాడారు. 'లోపలి చీకట్ల రహస్యాన్వేషణ'గా రవి వీరెల్లి 'కుందాపన'ను ఆవిష్కరించారు. "రవి ఎన్నుకున్న వస్తువుని తన కళ్ళల్లోకి, మనసులోకి పిండుకోవడంలోనే తన శక్తియుక్తులని ఫణంగా పెట్టాడని, సాధారణ అంశాన్ని అసాధారణ భావగాఢతతో కవిత్వంగా ఎలా మలచాలో రవి కవిత్వాన్ని సాక్ష్యంగా చూపాడు. విప్పగుంట రామ మనోహర 'అంతర్లోచనం' ఓ అంతర్లోక సంచలనం' అంటూనే రామిరెడ్డి కవికి ఇచ్చిన నిర్వచనాన్ని చూడండి : "కవి స్వప్నరూప శిల్పి. స్వప్న సహవాసి. స్వప్న సహపాఠి. కవి దృష్టిలో ప్రపంచం స్వప్నమంత విశాలం. స్వప్నం హృదయమంత విశాలం".

ఈ వ్యాసాల్లో చాలాచోట్ల రామిరెడ్డి గారు కవిత్వ నిర్మాణానికి సంబంధించి స్పష్టమైన ప్రకటనలు చేశారు. ఒక కవిగా కవితని ఎలా నిర్మించాలో తనకు తెలుసు. దాన్ని ఆధారంగా చేసుకుని ఇతర కవుల నిర్మాణాల గురించి చాలా సులభంగా మదింపు చేశారు. ఇట్లాంటివి కొత్తగా కవిత్వం రాసే వాళ్ళకి, తమ కవిత్వంలో లోపాలను తెలుసుకోలేని వాళ్ళకి ఉపయోగపడతాయి. మువ్వా శ్రీనివాసరావు గారి వాక్యాంతాన్ని వాక్ ప్రవాహ పారవశ్యంగా వర్ణించారు. మువ్వా కవిత్వాన్ని ఎలా లోకంగా మలచుకున్నారో చెప్పారు. మువ్వా తన స్వర సమరం నిమిత్తం అక్షరాన్ని, వాక్యాన్ని, పద్యాన్ని, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకున్నాడని; కవిత్వాన్ని విభిన్న భంగిమల్లో ప్రదర్శనకు పెట్టి కవిత్వ భాషలోనే తన భావ సముద్రాలను సృష్టించాడని, అతను అక్షర శస్త్రకారుడని చెప్పారు.

• • •

వ్యాసాలకు ఆయన పెట్టిన శీర్షికల ద్వారానే ఆ సారాంశాన్ని చెప్పడం ఇందులోని ప్రత్యేకత. 'స్త్రీవాద తాత్వికతకు నీరాజనం' అంటూ మందరపు హైమవతి 'నీలి గోరింట'ను; 'మూడో కంటిలో మెరిసిన కవన దృశ్యాలు' అంటూ ఏనుగు నరసింహారెడ్డి 'నీడల దశ్యాలు'ను; 'జనన మరణాల జాగృత జమానా'గా ఏటూరు నాగేంద్రరావు కవిత్వాన్ని; 'సాంకేతిక వనంలో సాహిత్య వసంతం'గా కుడికాల వంశీధర్ నానీలను; 'లోతైన గాయాలకు ఘాటైన లేపనం'గా శ్రీనివాస్ గౌడ్ కవిత్వాన్ని; 'మార్మిక కవిత్వ కరచాలనం'గా పెరుగు రామకృష్ణ 'వర్ణలిపి'ని వర్ణించటం రామిరెడ్డి ప్రతిభకు నిదర్శనం.

ఈ వ్యాససంపుటిలో పరిమాణంలో రెండు పెద్ద వ్యాసాలు ఉన్నాయి. 'ఈ తరానికి వరం కవితా స్రవంతి' అంటూ అరసం వెలువరించిన ప్రసిద్ధ కవుల సంకలనాల విశ్లేషణ, అలాగే 'కఠిన సుందర కవితా ప్రస్థానమూర్తి' అంటూ ప్రసాదమూర్తి కవిత్వం మీద అంచనా సుదీర్ఘంగా సాగిన వ్యాసాలు.

సృజనాత్మకంగా ఆలోచించడానికి అనుగుణంగా విమర్శ పాఠకుణ్ని సిద్ధం చేస్తుంది. అయితే రామిరెడ్డి గారి సహృదయత ఆయా కవుల్లోని చిన్న చిన్న లోపాలను చెప్పడానికి అడ్డు వచ్చి ఉంటుంది. అందుకే ఆయన లోపాల జోలికి వెళ్లలేదు. ఈ కవిత్వ వ్యాసాలను చదవడం ద్వారా ఆ 26 పుస్తకాలను మాత్రమేగాక ఆయా కవుల అభివ్యక్తి, నిర్మాణం, శైలి ఆధారంగా మనం కూడా కొన్ని నిర్ధారణలు చేయగలం. ఈ వ్యాసాలు మనల్ని మరింత మెరుగు పరుస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.

- డాక్టర్ సుంకర గోపాల్
94926 38547

కొలకలూరి పురస్కారాలు -2025

కొలకలూరి సాహిత్య పురస్కారాలు 2025 కోసం కవిత్వం, నాటకం, పరిశోధన గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం. 1. కొలకలూరి భాగీరథి పురస్కారం (కవిత్వం), 2. కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారం (నాటకం), 3. కొలకలూరి రామయ్య పురస్కారం (పరిశోధన) కోసం ఆయా ప్రక్రియల్లో ప్రచురితమైన గ్రంథాలు నాలుగేసి ప్రతులు 15.1.2025లోగా పంపాలి. ఈ గ్రంథాలు జనవరి 1.1.2023 తర్వాత ముద్రితమై ఉండాలి. పురస్కార ప్రకటన 15.2.2025న వెలువడుతుంది. 26.2.25న పురస్కారం ప్రదానం జరుగుతుంది. ఒక్కొక్క పురస్కారానికి రూ.15 వేల నగదు, జ్ఞాపిక, శాలువా ప్రదానం చేయబడతాయి. కవిత్వం, నాటకం ప్రతులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, (సెల్ 94419 23172), తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502కి; పరిశోధన గ్రంథాలు ఆచార్య కొలకలూరి సుమకిరణ్, (సెల్: 99635 64664), ఆంగ్లాచార్యులు, ఆంగ్లశాఖాధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502కు పంపాలి.

- కొలకలూరి పురస్కారాల కమిటీ

తెలుగు సాహితీవనం
కథా, కవితా పురస్కారం -2025

తెలుగు సాహితీవనం కథా, కవితా పురస్కారం కోసం కథలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. నలుగురు కథల విజేతలకు ఒక్కొక్కరికి రూ.2,116, నలుగురు కవితల విజేతలకు రూ.1116 చొప్పున బహుమతులతో పురస్కార ప్రదానం ఉంటుంది. హైదరాబాద్‌లో జరిగే తెలుగు సాహితీవనం 8వ వార్షికోత్సవ సభలో విజేతలకు పురస్కారం అందచేస్తాము. కథలు, కవితలు వర్తమాన పరిస్థితులు, మానవ సంబంధాలు ... ఇలా ఏ సాంఘిక ఇతివృత్తం రాసినా ఫర్వాలేదు. కథ 1200 పదాలకు, కవిత 25 వాక్యాలకు పరిమితం. ఒకరు ఒక కథ, ఒక కవిత మాత్రమే విడివిడిగా పంపించాలి. విజేతలు తప్పనిసరిగా హైదరాబాద్‌లో జరిగే వార్షికోత్సవ సభకు వచ్చి పురస్కారం అందుకోవాలి. కథ/ కవిత యూనికోడ్‌లో టైప్ చేసి టెక్స్ రూపంలో మేమిచ్చిన కింది గూగుల్ ఫామ్ ద్వారా పంపించాలి. https://tinyurl.com/sahitivanam-poti పంపటానికి చివరి తేదీ : 20.1.2025. సంప్రదింపులకు : 95022 36670, 83096 86404.

- తెలుగు సాహితీవనం

కథా సంపుటాలకు ఆహ్వానం

కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం-2024 కోసం 2023లో ముద్రితమైన కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. మూడు ప్రతులను జనవరి 31, 2024 లోపు పంపాలి. బహుమతి పొందిన కథ సంపుటికి నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరపున 2025 ఏప్రిల్‌లో రూ.10 వేల నగదు పురస్కారం, జ్ఞాపిక ప్రదానం జరుగుతుంది. మీ ప్రతులు పంపవల్సిన చిరునామా : పి.అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నెం. 15-120/4/1, రహత్ నగర్ కాలనీ, నగర్ కర్నూల్ - 509209. తెలంగాణ. ఫోను : 94419 46909.

- వనపట్ల సుబ్బయ్య, 94927 65358

ఢిల్లీలో జోరుగా 'ఆపరేషన్ లోటస్'

- బిజెపిపై కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 'ఆపరేషన్ లోటస్'ను బిజెపి ముమ్మరంగా సాగిస్తోందని ఆమాద్మీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రూపాల్లో ప్రత్యర్థి నేతలను బెదిరించడం, లేదా రకరకాల ఎరలు విసిరి బిజెపిలోకి ఫిరాయించేలా చేయడం 'ఆపరేషన్ లోటస్'లో భాగం. అత్యంత అప్రస్వామికమైన ఈ ఎత్తుడను బిజెపి ఇప్పుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనూ అమల్జేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని కేజ్రీవాల్ వాపోయారు. రాజ్యసభ ఎంపి రాఘవ్ చద్దా, ఢిల్లీ సిఎం అతిషీతో కలిసి ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఓటరు జాబితాను తారుమారు చేసేందుకు బిజెపి యత్నిస్తోందని కూడా కేజ్రీవాల్ ఆరోపించారు. ఒక్క నియోజకవర్గంలోనే 11,000 ఓటర్ల తొలగింపు దరఖాస్తులను దాఖలు చేసిందని, అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్ జోక్యంతో ఆ చర్య నిలిచిపోయిందని అన్నారు. తన అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటివరకు 5,000 ఓటరు తొలగింపు దరఖాస్తులు, 7,500 అదనపు అభ్యర్థనలు దాఖలయ్యాయని, డిసెంబర్ 15న పెద్ద ఎత్తున ఈ ఆపరేషన్ ప్రారంభమైందని అన్నారు. ఈ చర్య నియోజకవర్గ ఓట్లను 12 శాతం మార్చగలదని అన్నారు. బలమైన అభ్యర్థులను, సమస్యలను సృష్టించడంలో విఫలమైన బిజెపి ఇప్పుడు 'అన్యాయమైన మార్గాల్లో' ఎన్నికల్లో గెలవాలని యత్నిస్తోందని, కానీ బిజెపి ప్రయత్నాలను తిప్పికొడతామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ఈ విధమైన చర్యలను నిరోధించేందుకు ఎన్నికల కమిషన్ తగిన పర్యవేక్షణను కొనసాగించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఆ రాష్ట్రాలకు కోల్డ్ వేవ్ అలర్ట్

న్యూఢిల్లీ : ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాలకు వాతావరణ శాఖ కోల్డ్ వేవ్ అలర్ట్ ఇచ్చింది. జమ్ము కాశ్మీర్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీలో డిసెంబర్ 30 నుంచి జనవరి 2 వరకు తీవ్రమైన చలి (కోల్డ్ వేవ్) ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి చలి తీవ్రంగా ఉంటుందని తెలిపింది. హిమాచల్‌ప్రదేశ్‌లో మరో రెండు రోజులపాటు మంచు కురుస్తుందని వెల్లడించింది. కాశ్మీర్‌లో మంచు ప్రభావంతో ఇప్పటికే రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇక్కడ పలు విమానాలు, రైళ్లు ఇప్పటికే రద్దయ్యాయి. ఇక దేశ రాజధాని ఢిల్లీలో మరో రెండు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఢిల్లీకి వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

కాశ్మీర్ యూనివర్శిటీ పరీక్షలు వాయిదా

ప్రతికూల వాతావరణం కారణంగా సోమవారం జరగాల్సిన అన్ని పరీక్షలను కాశ్మీర్ యూనివర్శిటీ వాయిదా వేసింది. ఈ మేరకు యూనివర్శిటీ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. వాయిదా పడిన పరీక్షల కోసం తాజా షెడ్యూల్‌ను తర్వాత ప్రత్యేకంగా తెలియజేస్తామని పేర్కొంది. గత కొన్ని రోజులుగా కాశ్మీర్‌లో భారీ హిమపాతం కురుస్తోన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా శుక్రవారం, శనివారం కురిసిన మంచుతో పలు ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి.



ఉత్తర కొరియా కొత్త ప్రధానిగా పాక్ థే-సాంగ్

ప్యాంగ్‌యాంగ్: ఉత్తర కొరియా (డిపిఆర్‌కె) కొత్త ప్రధానిగాపాక్ థే-సాంగ్‌ను పాలక పార్టీ నియమించినట్లు కొరియన్ అధికారిక వార్తా సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కెసిఎన్ఎ) ఆదివారం తెలిపింది. ఈనెల 23 నుండి 27 వరకు ప్యోంగ్యాంగ్‌లో జరిగిన ఎనిమిదవ సెంట్రల్ కమిటీ పదకొండవ ప్లీనరీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం అనంతరం విడుదలజేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. పాక్ థే పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా కూడా ఉన్నారు. ఆయనతోబాటు విదేశాంగ మంత్రి చోయ్ సోన్ హుయిని కూడా పొలిట్‌బ్యూరో లోకి తీసుకున్నారు.

11 కీలకమైన ఖనిజ బ్లాకుల వేలం రద్దు

- సరైన స్పందన లేకపోవటంతో ప్రభుత్వం చర్య

న్యూఢిల్లీ : నాలుగో రౌండ్‌లో సరైన స్పందన లేకపోవటంతో 11 కీలకమైన ఖనిజ బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు రద్దు నోటీసును జారీ చేసింది. నాలుగు బ్లాకులకు బిడ్‌లు రాకపోగా.. మిగిలిన ఏడు గనులకు మూడు కంటే తక్కువ సాంకేతిక అర్హత కలిగిన బిడ్డర్లు లభించినట్టు నోటీసులో పేర్కొన్నారు. టంగ్‌స్టన్, గ్లాకోనైట్‌లతో కూడిన నాలుగు బ్లాక్‌లు ఛత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో ఉన్నాయి. అంతకముందు మూడో రౌండ్‌లో మూడు కీలకమైన మినరల్ బ్లాక్‌లు, రెండో రౌండ్‌లో 14 బ్లాక్‌లు, మొదటి విడతలో 14 కీలకమైన ఖనిజాల బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. నాలుగు రౌండ్ల వేలంలో 24 కీలకమైన, వ్యూహాత్మకమైన మినరల్ బ్లాక్‌లను విక్రయించినట్టు ప్రభుత్వం గతంలో పేర్కొన్నది.

ఉపాధి పథకంలో తక్కువ వేతనాలు

- పార్లమెంటరీ కమిటీ పెదవి విరుపు
- పనిదినాలు పెంచాలని సూచన
- వేతనాలు సవరించాలని సిఫారసు



న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు తక్కువ వేతనాలు లభిస్తుండడంపై పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. కార్మికుల వేతనాలు సవరించాలని, వాటిని ద్రవ్యోల్బణ రేటుకు అనుగుణంగా ధరల సూచీతో అనుసంధానం చేయాలని సూచించింది. గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటు చేసిన కమిటీ ఉపాధి హామీ పథకం వేతన రేటుపై ఇటీవల లోక్‌సభకు తన నివేదికను అందజేసింది. పథకంలో కనీస పనిదినాలను 100 నుంచి 150కి పెంచాలని కూడా కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలకా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది.

2006లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2011-12 వరకూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన కనీస వేతనాల ఆధారంగానే వేతన రేటును నిర్ణయించారు. 2011-12 నుంచి వ్యవసాయ కార్మికుల వినియోగ ధరల సూచీ (సిపిఐ-ఎఎల్)ని ఉపయోగించి కేంద్ర ప్రభుత్వమే వేతన రేట్లను నిర్ణయించడం మొదలు పెట్టింది. ఈ సూచీ ఆహార వస్తువులకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. అయితే గ్రామీణ ప్రాంత వినియోగ ధరల సూచీ (సిపిఐ - రూరల్) ఆధారంగా కార్మికుల వేతనాలను నిర్ణయిస్తే సబబుగా ఉంటుందని 2015లో ఆర్థికవేత్త మహేంద్ర దేవ్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ, 2018లో గ్రామీణాభివృద్ధి శాఖ సీనియర్ అధికారి నగేష్ సింగ్ నేతృత్వంలో ఏర్పడిన మరో కమిటీ అభిప్రాయపడ్డాయి. ద్రవ్యోల్బణ ప్రభావం నుండి ఈ సూచీ వేతనాలకు రక్షణగా నిలుస్తుందని తెలిపాయి. ఆహార, ఇతర సేవలపై పెట్టే వ్యయాలకు ఈ సూచీ సమాన ప్రాధాన్యత ఇస్తుందని చెప్పాయి.

ఏ పనికైనా రోజుకు కనీసం రూ.375 వేతనం ఇవ్వాలని 2018లో కార్మిక ఆర్థికవేత్త అనూప్ శతపతి నేతృత్వంలో ఏర్పడిన కమిటీ సిఫారసు చేసింది. కాగా ఉపాధి పథకం కార్మికులకు ప్రస్తుతం నామమాత్రపు వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా ఆలస్యంగా అందుతున్నాయని పార్లమెంటరీ కమిటీ ఎత్తిచూపింది. కార్మికుల వలసలకు ఇది కూడా ఓ కారణమని తెలిపింది.

ప్రతి కుటుంబానికీ ఏడాదికి కనీసం 150 పనిదినాలు కల్పించాలన్న పౌర సమాజ బృందాల డిమాండుకు కమిటీ గతంలోనే మద్దతు తెలిపింది. పనిదినాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతి ఇచ్చామని గ్రామీణాభివృద్ధి శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలియజేసింది. అయితే అదనపు పనిదినాలకు చెల్లించే వేతనాల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరించాల్సి ఉంటుంది. ఈ సమాధానంపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్ట సవరణ ద్వారా పనిదినాలను పెంచి, ఆ నిబంధనను దేశంలోని అన్ని రాష్ట్రాలకూ వర్తింపజేయాల్సింది గ్రామీణాభివృద్ధి శాఖేనని స్పష్టం చేసింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని తప్పనిసరి చేయకూడదని, దానికి బదులు ప్రత్యామ్నాయ యంత్రాంగాన్ని రూపొందించాలని కూడా కమిటీ సూచించింది.

పౌరసత్వాన్ని వదులుకుంటున్నారు !


- 13 ఏళ్లలో 18 లక్షల మంది భారతీయులది ఇదే దారి
- 135 దేశాల జాతీయతను పొందిన వైనం
- జాబితాలో పాక్, బంగ్లా, శ్రీలంక, నేపాల్, నమీబియాలు కూడా
- కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ : గత 13 ఏండ్లలో 18 లక్షల మందికి పైగా భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. 135 దేశాల జాతీయతను పొందారు. రాజ్యసభలో ప్రభుత్వ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఈ గణాంకాల ప్రకారం.. పౌరసత్వం కోసం భారతీయులు ఎంచుకున్న దేశాల జాబితాలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఫిజీ, మయన్మార్, థాయిలాండ్, నమీబియా, నేపాల్, శ్రీలంకలు కూడా ఉన్నాయి. అయితే, ఈ దేశాలు అభివృద్ధి విషయంలో భారత్ కంటే వెనకబడిన దేశాలు కావటం గమనార్హం. అయినప్పటికీ, ఈ దేశాల పౌరసత్వాన్ని భారతీయులు పొందారు. ఇవి కాకుండా భారతీయులు పౌరసత్వం కోసం ముఖ్యంగా యూఎస్, కెనడా, రష్యా, చైనా, ఈజిప్ట్, న్యూజిలాండ్, సింగపూర్, దక్షిణాఫ్రికా, స్పెయిన్, సూడాన్, స్విట్జర్లాండ్, ట్రినిడాడ్ అండ్ టొబాగో, యూకే, టర్కీ, యూఏఈ, వియత్నాం వంటి దేశాలను ఎంపిక చేసుకున్నారు.

కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) సమర్పించిన సమాచారం ప్రకారం.. 2022లో రికార్డు స్థాయిలో 2,25,620 మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. 2023లో ఇది 2.16 లక్షలకు పైగా ఉన్నది. 2015 నుంచి 2023 వరకు 12 లక్షల మందికి పైగా భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొని, ఇతర దేశాల పౌరసత్వాన్ని పొందటానికి నిర్ణయించుకున్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన ఏడాది అయిన 2020లో అత్యల్ప సంఖ్యలో 85,256 మంది భారతీయులు ఇతర దేశాల పౌరసత్వాన్ని ఎంచుకున్నారు. అయితే, భారతీయులు పౌరసత్వాన్ని వదులుకోవటానికి 'వ్యక్తిగతం' కారణంగా కేంద్రం వివరించింది. మెరుగైన కెరీర్ అవకాశాలు, జీవన నాణ్యత, మెరుగైన విద్యా అవకాశాలు వంటి కారణాలే భారత పౌరసత్వాన్ని వదులుకోవటానికి దారి తీస్తున్నాయని కొంత మంది నిపుణులు అంటున్నారు. కార్మికులు, ప్రొఫెషనల్స్, నిపుణులతో సహా దాదాపు 1.30 కోట్ల మంది భారతీయ పౌరులు ప్రస్తుతం విదేశాల్లో నివసిస్తున్నారని విదేశీ మంత్రిత్వశాఖ నివేదించింది.

రాజ్యాంగ పీఠిక చదవండి.. సర్టిఫికెట్ పొందండి

- 'మన్‌కీ బాత్'లో మోడీ



న్యూఢిల్లీ : భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం 'మన్‌కీ బాత్'లో ప్రస్తావించారు. రాజ్యాంగం పీఠికను చదివి.. ఆ వీడియోను రికార్డు చేసి వెబ్‌సైట్‌లో షేర్ చేయడం ద్వారా ఓ సర్టిఫికెట్‌ను పొందొచ్చునని ఆయన పేర్కొన్నారు. ఈ క్యాంపెయిన్‌లో పాల్గొనేందుకు www.constitution75.com వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. ఈ వెబ్‌సైట్ హోమ్ పేజీకి వెళ్లగానే 'హమారా సంవిధాన్.. హమారా స్వాభిమాన్' పేరుతో రాజ్యాంగ పీఠికను ఉంచారు. అక్కడ పార్టిసిపేట్ అనే బటన్‌పై క్లిక్ చేయడం ద్వారా ఎంచుకున్న భాషలో రాజ్యాంగ పీఠికను చదవవచ్చు. సర్టిఫికెట్ పొందాలంటే.. తొలుత మీ వ్యక్తిగత వివరాలు ఎంటర్ చేయాలి. రాజ్యాంగ పీఠికను చదువుతున్న వీడియోను అక్కడే కెమెరా ఆన్ చేసి రికార్డు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వీడియోను అప్‌లోడ్ చేసి సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఆధిపత్య శక్తుల యుద్ధ భూమి కానివ్వం

- పశ్చిమాసియాలో శాంతి సాధనే లక్ష్యం
- పునరుద్ఘాటించిన ఇరాన్, చైనా



బీజింగ్: ఆధిపత్యవాద శక్తులు పశ్చిమాసియాను యుద్ధ భూమిగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయని, ఈ యత్నాలను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించబోమని ఇరాన్, చైనా పునరుద్ఘాటించాయి. ఈ ప్రాంతంలో పెరుగుతున్న అస్థిరత , అనిశ్చితిని తొలగించి శాంతి సుస్థిరత నెలకొల్పాల్సిన అవసరముందని ఈ ఇరు దేశాల విదేశాంగ మంత్రులు చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి ఈ ప్రాంతానికే కాదు, ప్రపంచ శాంతి, సుస్థిరత, అభివృద్ధికి కూడా దోహద పడుతుందని వారు ఉద్ఘాటించారు. రెండు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ఆచరణాత్మక సహకారం, మెరుగైన బహుపాక్షిక సమన్వయానికి తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పాయి.

చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘి శనివారం నాడిక్కడ సమావేశమై పశ్చిమాసియాలో తాజా పరిస్థితిపై చర్చించారు. అదే సమయంలో ఇరాన్, చైనా మధ్య ద్వైపాక్షికక సంబంధాలను మరింత బలోపేతం గావించాలని సంకల్పించారు. ఇరాన్ విదేశాంగ మంత్రిగా ఆగస్టులో బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరఘీ చైనా పర్యటించడం ఇదే తొలిసారి. జులైలో ఏర్పాటైన కొత్త ఇరాన్ ప్రభుత్వం నుంచి చైనాకు వచ్చిన మొదటి అధికారి కూడా ఈయనే. ప్రధాన ఆధిపత్య శక్తుల యుద్ధభూమిగా పశ్చిమాసియా మారరాదని అన్నారు. అంతర్జాతీయ సమాజం పశ్చిమాసియా దేశాల సార్వభౌమాధికారాన్ని ప్రాదేశిక సమగ్రత, చట్టబద్ధమైన ఆందోళనలను గౌరవించాలని వాంగ్ యీ పేర్కొన్నారు.వేలెత్తి చూపడం , ఏకపక్షంగా ఆంక్షలు విధించడం, ఒత్తిడి చేయడం, ఘర్షణను ప్రేరేపించడం వంటి చర్యలకు స్వస్తి చెప్పి పశ్చిమాసియాలో శాంతి సుస్థిరత నెలకొనేందుకు నిర్మాణాత్మక సహకారాన్ని అందించాలని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలనుద్దేశించి వారు అన్యాపదేశంగా పేర్కొన్నారు.

పాలస్తీనా ప్రజల చట్టబద్ధమైన హక్కులను గౌరవించడం, ఆక్రమణను అంతం చేయడం ద్వారా పాలస్తీనా సమస్యను పరిష్కరించాల్సిన అవసరముందని ఇరు దేశాల విదేశాంగ మంత్రులు ఉద్ఘాటించారు. ఈ ప్రాంతాన్ని గందరగోళం నుండి క్రమంగా మార్చడానికి తక్షణం కాల్పుల విరమణ ప్రకటించడం, దళాలను పూర్తిగా ఉపసంహరించుకోవడం, అత్యవసర మానవతా సాయం నిరాఘాటంగా అందేలా చూడాల్సిన ఆవశ్యకతను వారు నొక్కి చెప్పారు.

సిరియాకు సంబంధించి, రెండు దేశాలు సిరియా సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం మరియు ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని పునరుద్ఘాటించాయి,

గాజా వివాదం , సిరియాలో తీవ్రమైన మార్పుల వెనుక ఆధిపత్యవాదుల హస్తం ఉందని నింగ్‌సియా విశ్వవిద్యాలయంలోని చైనా-అరబ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ లి షావోక్సియన్ పేర్కొన్నారు.

ఇరాన్ విదేశాంగ మంత్రి ఆరాఘి శుక్రవారం పీపుల్స్ డైలీ లో రాసిన వ్యాసంలో ఆసియాలోని రెండు పురాతన నాగరికతల మధ్య సహకారం కాల పరీక్షను తట్టుకుని నిలిచాయని అన్నారు. చైనా చాలా సంవత్సరాలుగా ఇరాన్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది.

బనకచర్లకు గో'దారి'

(మొదటి పేజీ తరువాయి)

కండలేరుకు నీటిని తరలిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని వివిధ లిఫ్టులు, కాలువుల ద్వారా అన్ని ప్రాజెక్టులకు అందిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాగార్జున సాగర్ కుడికాలువ వల్ల సాగయ్యే పంటలకు కూడా సమృద్ధిగా నీటిని అందజేయవచ్చని చర్చించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కరువు ప్రాంతంగా ఉన్న వెలుగొండ ప్రాజెక్టు నీటి అవసరాలను కూడా తీర్చుతుందని భావిస్తున్నారు. గోదావరి వరద సమయంలో 280 టిసిఎంల నీటిని సీమకు తరలిస్తారు. పోలవరం ప్రాజెక్టు ఎగువ నుంచి రోజుకు మూడు టిఎంసిల నీటిని తరలించి, ఇందులో ఒక టిఎంసి కృష్ణా డెల్టాకు ఇస్తారు. ఈ నీటిని తరలించడం కోసం పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని పెంచాలని భావిస్తున్నారు. ఈ కుడికాలువను 17 వేల క్యూసెక్కుల సామర్థ్యం నుంచి 28-30 వేల క్యూసెక్కులకు పెంచుతారు. అదే విధంగా తాడిపూడి లిఫ్ట్ స్కీం కాలువ సామర్థ్యాన్ని కూడా 1500 క్యూసెక్కుల నుంచి 10 వేల క్యూసెక్కులకు పెంచి నీటిని తరలిస్తారు. సముద్రంలో వృథాగా పోయే నీటిని మాత్రమే తీసుకోవడం ద్వారా గోదావరి డెల్టాకు ఈ కొత్త ప్రాజెక్టు వల్ల నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటారని పేర్కొన్నారు.

కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన సిఎం

ఈ కొత్త ప్రాజెక్టు అంశాన్ని ముఖ్యమంత్రి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సాయం చేయాలని కోరారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన ఆయన కేంద్ర పెద్దలతో ఈ ప్రాజెక్టుపై చర్చించారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఆర్థిక సాయం కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే పెద్ద గేమ్ ఛేంజర్ అవుతుందని ఆయన భావిస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.70 వేలకోట్ల నుంచి రూ.80 వేల కోట్లు ఖర్చు ప్రాజెక్టుకు అవుతుందని వారికి వివరించారు. 54 వేల ఎకరాల భూసేకరణ చేయాలని, 4 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని, పెద్ద మొత్తంలో అటవీ భూములు కూడా సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఇవన్నీ జరగాలంటే భారీ వ్యయమవుతుందని కేంద్రానికి వివరించారు. ఆదివారం నిర్వహించిన సమీక్షలో సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టుకు అనుమతులు పొంది టెండర్ల ప్రక్రియ పూర్తిచేయాలని జలవనరులశాఖ అధికారులకు సిఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రజల అవసరాల దృష్ట్యా అత్యంత వేగంగా, ప్రాధాన్యంతో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని భావిస్తున్నామని, అందులో భాగంగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని పనులు వేగంగా జరగాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పల్నాడు జిల్లాకు సిఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 31న పల్నాడు జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ఉదయం 10:30 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి బయలుదేరి 10:50 గంటలకు యల్లమంద గ్రామానికి చేరుకుంటారు. 11 నుంచి 11:30 గంటల మధ్యలో నరసరావుపేట నియోజకవర్గం యల్లమంద గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛను పథకం పంపిణీ కార్యక్రమంలో సిఎం పాల్గొనున్నారు. అనంతరం 11:35 నుంచి 12:35 గంటల వరకు లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 12:40 గంటల నుంచి ఒంటి గంట వరకు పల్నాడు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం 1:45 గంటలకు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం 2:55 గంటలకు ఉండవల్లిలోని నివాసానికి సిఎం చేరుకుంటారని సిఎంఒ కార్యాలయం తెలిపింది.

8న ప్రధాని పర్యటనను అడ్డుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ఎంత డబ్బు వృథా చేశారో చెప్తోంది తప్ప, దాన్ని దేనికి వాడనుందో స్పష్టం చేయడంలేదని వి.శ్రీనివాసరావు అన్నారు. ఇది ప్రజల ఆస్తి కనుక ఆ భవనాలను సైన్స్ మ్యూజియంగా మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. వరదలు ఎక్కువగా రావడానికి పర్యావరణాన్ని నాశనం చేయడం, దురాక్రమణలు కారణమని సుప్రీం కోర్టు వేసిన అనేక కమిటీలు తేల్చిన విషయాన్ని గుర్తు చేశారు. సముద్రపు ఒడ్డున మత్స్యకారులు ఉండే ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములన్నీ దురాక్రమణకు గురవుతున్నాయని తెలిపారు. సముద్రపు ఒడ్డున కోస్టల్ రీజియన్ ప్రకారం 20 మీటర్ల వరకు అనుమతులు ఇవ్వకూడదని, కానీ, పలు కార్పొరేట్ కంపెనీలు 20 మీటర్ల లోపలికి వెళ్లి వ్యర్థాలను వదులుతూ, నిర్మాణాలు చేపడుతున్నాయని అన్నారు. పర్యావరణానికి కార్పొరేట్ కంపెనీలు కల్పిస్తోన్న హాని వల్ల నీటి కొరత తీవ్రత పెరుగుతోందని తెలిపారు. ఉచితంగా దొరికే నీటిని కొనుక్కోవాల్సి వస్తోందన్నారు. చెరువులను కార్పొరేట్ మాఫియా కబ్జా చేస్తోందని తెలిపారు. ప్రజలకు ఇల్లు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైనందునే ఖాళీ స్థలాల్లో కొన్ని సంవత్సరాలుగా ఇల్లు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నారని వివరించారు.

పంచగ్రామాల ప్రజలకు న్యాయం చేయాలి

పంచగ్రామాల ప్రజలకు భూములపై హక్కులు లేవని, రెవెన్యూ గ్రామాలను దేవస్థానంలో కలిపేసి ఇప్పుడు వారికి పట్టాలు ఇవ్వబోమని గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేయడం తగదని వి.శ్రీనివాసరావు అన్నారు. ఈ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా రిజిస్టర్ చేసి పేదలకు వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా తేల్చకుండా ఉంచిన ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. 163 సర్వే నెంబర్‌లో దాదాపు పది నెలలుగా ఉంటున్న ప్రజలను తొలగించేందుకు ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి పనిచేస్తున్నట్లు తెలుస్తోందని, అదే జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



మన్మోహన్ సింగ్ అస్థికలను యమునాలో కలిపేందుకు తీసుకువెళ్తున్న ఆయన భార్య గురుశరణ్‌కౌర్, ఇతర కుటుంబ సభ్యులు

యమునా నదిలో మన్మోహన్ సింగ్ అస్థికల నిమజ్జనం

న్యూఢిల్లీ : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అస్థికలను ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం యమునా నదిలో నిమజ్జనం చేశారు. మజ్ను కాతిలా గురుద్వారా సమీపంలో అస్తఘాట్‌లో సిక్కు సంప్రదాయాల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ముందుగా మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరిగిన నిగంబోధ్ శశ్మాన వాటిక నుంచి అస్థికలను కుటుంబ సభ్యులు సేకరించారు. తరువాత అస్తఘాట్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, ముగ్గురు కుమార్తెలు ఉపిందర్ సింగ్, దమన్ సింగ్, అమృత్‌సింగ్, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, సిక్కు ఆచారాల ప్రకారం మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని మన్మోహన్ సింగ్ నివాసం వద్ద బుధవారం 'అఖండ్ పథ్'ను నిర్వహించనున్నారు. శుక్రవారం రాకబ్ గంజ్ గురుద్వారా వద్ద 'భోగ్', 'అంతిమ్ అర్దాస్' నిర్వహించనున్నారు. ఈ నెల 26న 92 ఏళ్ల మన్మోహన్ సింగ్ అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే.

నవయుగ్ టన్నెల్‌కు మన్మోహన్ సింగ్ పేరు : ఒమర్ అబ్దుల్లా

జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిపై ఉన్న నవయుగ్ టన్నెల్‌కు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రతిపాదించారు. ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ హయాంలోనే శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా మార్చడం ప్రారంభమైందని అబ్దుల్లా గుర్తు చేశారు. నాలుగు వరుసలుగా మార్చడం తరువాత ఈ రోజున ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి కేవలం ఐదు గంటల సమయం మాత్రమే పడుతుందని చెప్పారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ వివరాలను తెలిపారు. జమ్మూకాశ్మీర్‌కు మన్మోహన్ సింగ్ చేసిన గణనీయమైన కృషిని అబ్దుల్లా ప్రస్తావించారు. అయితే ఇటీవల నవయుగ్ టన్నల్ ఘనతను ఇతరులు తీసుకుంటున్నారని విమర్శించారు. జాతీయ రహదారిని అధునీకరించడానికి పునాది వేసింది మన్మోహన్ అని, కాబట్టి ఖాజీగుండ్, బనిహాల్‌ను కలిపే నవయుగ్ టన్నల్‌కు ఆయన పేరు పెట్టాలని అబ్దుల్లా ప్రతిపాదించారు.

గంటకు 450 కిమీ వేగం అత్యాధునిక రైలు ఆవిష్కరించిన చైనా

బీజింగ్ : రైల్వేల్లో అత్యున్నత సాంతికేత విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న చైనా తాజాగా మరో వేగవంతమైన రైలును ఆవిష్కరించింది. హై-స్పీడ్ బుల్లెట్ రైలు సిఆర్450 ఇఎంయు (ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లు)ను ఆదివారం బీజింగ్‌లో చైనా రైల్వే అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ రైలును ప్రపంచంలోనే హై-స్పీడ్ రైలుగా చైనా రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ రైలు పరీక్షా సమయంలో గంటకు 450 కిలోమీటర్ల వేగాన్ని అందుకుందని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో గంటకు 400 కిలోమీటర్ల వేగాన్ని చేరుకుంటుందని చెప్పారు. క్షేత్రస్థాయి వేగం, ఇంధన వినియోగం, అంతర్గత శబ్దం, బ్రేకింగ్ దూరం.. వంటి అంశాల్లో ఈ రైలు నూతన అంతర్జాతీయ బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తుందని చైనా రైల్వే పేర్కొంది. దేశంలో ప్రస్తుతం ఉన్న సిఆర్ 400 ఫజింగ్ హైస్పీడ్ రైళ్లకంటే (ఇవి గరిష్టంగా గంటకు 350 కిలోమీటర్ల వేగంతో నిర్వహించబడతాయి) సిఆర్450 అధిక వేగంతో ప్రయాణిస్తాయని, వాటితో పోలిస్తే 10 శాతం తక్కువ బరువు ఉంటాయని అధికారులు చెప్పారు.

ఇది వినియోగంలోకి వచ్చే నాటికి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వాణిజ్య రైలుగా నిలుస్తుందని తెలిపారు.

విమానం కూలి 179 మంది దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)



ప్రాణాలతో బయటపడినట్టు సమాచారం. ఇది ఇప్పటివరకు జరిగిన కొరియా విమాన ప్రమాదాల్లో కెల్లా అత్యంత ఘోరమైనది.

పైలట్ 'మేడే' (ఓడలు, విమానాలు ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు ఉపయోగించే అంతర్జాతీయ రేడియో డిస్ట్రెస్ సిగ్నల్) సంకేతాలు ఇచ్చిన అయిదు నిమిషాలకే విమానం కుప్పకూలింది. 'బ్లాక్ బాక్స్' పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. సంవత్సరాంతపు టూర్‌లో భాగంగా బ్యాంకాక్ వెళ్లి తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రయాణికుల్లో 82 మంది పురుషులు ఉండగా, మహిళలు 93 మంది ఉన్నారు. మూడేళ్ల పిల్లల నుంచి 78 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారు.

బ్యాంకాక్ నుంచి జెజు ఎయిర్‌ఫ్లైట్‌కు చెందిన 7సి 2216 నంబర్ బోయింగ్ 737-800 శ్రేణి విమానం 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో వస్తున్న క్రమంలో మువాన్ కౌంటీలోని విమానాశ్రయంలో ఈ ప్రమాదం సంభవించింది. ల్యాండింగ్ గేర్ పని చేయకపోవటం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ విమాన ప్రమాద లైవ్ దృశ్యాలు సోషల్ మీడియాలో షాక్‌కు గురి చేస్తున్నాయి. ఫ్లైట్ ఒక్కసారిగా పేలిపోయి, భారీగా మంటలు చెలరేగిన దృశ్యాలు కనిపించాయి. ఈ ఘటనలో విమానం మొత్తం పూర్తిగా కాలిపోయింది.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాయి. ఇందుకు మొత్తం 32 అగ్నిమాపక వాహనాలు, పలు హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్-మోక్ ఈ ప్రమాదంపై స్పందించారు. అంతర్గత, భద్రతా మంత్రిత్వ శాఖకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలు చేపట్టాలని చెప్పారు. విమానంలో ప్రయాణిస్తున్నవారిలో ఎక్కువ మంది కొరియన్లు, ఇద్దరు థాయ్ దేశస్థులు ఉన్నారని తెలిసింది.

జనవరి 4 వరకు జాతీయ సంతాప దినాలు

విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో చోయ్ సాంగ్-మోక్ వచ్చే నెల 4 వరకు జాతీయ సంతాప దినాలను ప్రకటించారు. ఈ ప్రమాదంపై ఎక్స్‌లో ఆయన స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం సానుభూతి తెలియజేస్తున్నదని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ప్రత్యేక విపత్తు జోన్‌గా ప్రకటించారు. ఇటు థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా కూడా మృతుల కుటుంబాలకు, గాయపడినవారికి సానుభూతిని తెలియజేశారు.

క్షమాపణలు చెప్పిన జెజు సిఇఒ కిమ్ ఈ-బే

జెజు ఎయిర్‌లైన్స్‌ను దక్షిణ కొరియాలో భారీ బడ్జెట్‌తో 2005లో స్థాపించారు. అయితే, ప్రస్తుత ఘటనతో ఈ ఎయిర్‌లైన్స్ తొలిసారి ఇది అతిపెద్ద ప్రమాదాన్ని చూసింది. ఈ ప్రమాదంపై జెజు ఎయిర్ సిఇఒ కిమ్ ఇబె స్పందించారు. ప్రమాదం పట్ల క్షమాపణలు చెప్పారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామనీ, అదే తమ ప్రాధాన్యత అని చెప్పారు. దర్యాప్తునకు ఎయిర్‌లైన్స్ సహకరిస్తుందని వివరించారు.

గతంలో ప్రమాదాలు

1997లో గువామ్‌లో కొరియన్ ఎయిర్‌లైన్స్ ప్రమాదంలో 200 మందికి పైగా మృతి చెందారు. ఆ తర్వాత అతిపెద్ద విమాన ప్రమాదం ఇదే కావటం గమనార్హం. ఇక ఎయిర్ చైనా నడిపే బోయింగ్ 767-200 విమానం 2002లో దక్షిణ కొరియాలో ప్రమాదానికి గురై 129 మంది మరణానికి కారణమైంది. ఈ ఘటనలో 37 మంది గాయపడ్డారు.



మీకోసం

వెండి సామగ్రి, ఆభరణాలు ఉంచేచోట కర్పూరం బిళ్లలను ఉంచితే నల్లబడకుండా ఉంటాయి.

జీవన సౌరభం

చేసే పనులవల్లే గొప్పవాళ్లవుతారు. పుట్టుకతో కాదు.

సమయోచితం



ఒక రోజు ఓ గురువు, ఇద్దరు శిష్యులను వెంటబెట్టుకొని అడవి గుండా నడుస్తున్నారు. వారికి కాస్త దూరంలో బిగ్గరగా పులి గాండ్రింపు వినబడింది. వెంటనే శిష్యులు ప్రాణభయంతో వణికిపోతూ ఏడవసాగారు. గురువు ఎంతగా నచ్చజెప్పినా వారు ఏడుపు ఆపడం లేదు. అప్పుడు 'నాయనలారా ఒకసారి మీ చేతులు చూపించండి!' అంటూ గురువు వారి చేతి రేఖలు పరిశీలించారు.

'భయపడకండి, మీరు ఇంకా ఎనభై సంవత్సరాల వరకు బతుకుతారు. అయితే ఆపద వచ్చినప్పుడు ధైర్యంగా ఉండడం నేర్చుకుంటేనే ఇది నిజమవుతుంది' అని చెప్పారు. శిష్యులిద్దరూ వెంటనే ఏడుపు ఆపేసి 'గురువుగారూ! మరి మీ విషయం?' అని అనుమానంగా అన్నారు.

'నాకేం భయం లేదు. పులి వస్తే, ఎలా తప్పించుకోవాలో నాకు తెలుసు' అని చిరునవ్వు నవ్వారు. ఆ తరువాత వారికి ఏ పులీ ఎదురురాలేదు. ముగ్గురూ క్షేమంగా అడవి దాటారు. 'గురువు గారు! మీరు జోస్యం అద్భుతంగా చెప్పారు. మా ప్రాణాలు కాపాడారు' అన్నారు శిష్యులు.


'నాకు జాతకం చూడటం కాని, ఆయుష్షు ఎంతుందో చెప్పటం కానీ చేతకాదు. మీకు ఎనభై సంవత్సరాల వరకు మృత్యువు రాదని ఊరికే చెప్పాను. మీలో పిరికితనం పోయి ధైర్యం రావడం కోసం అబద్ధమాడవలసి వచ్చింది. సమస్య వచ్చినప్పుడు భయపడకుండా అది ఎదుర్కోవడానికి సిద్ధపడాలి. ఏడుపు దేనికీ పరిష్కారం కాదు' అన్నారు గురువు. గురువు మాటలకు శిష్యులు మరొక కొత్త పాఠం నేర్చుకున్నారు.

– కె.వి.సుమలత,
గుడివాడ, కృష్ణ జిల్లా.
94926 56255.

లెక్క తేల్చండి

పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 152



నేను గీసిన బొమ్మ





పశుపతి ధనుంజయ్‌రాజు,
6వ తరగతి,
ఎ.పి మోడల్ స్కూల్,
వి.పి.రెడ్డిపాలెం,
పల్నాడు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఎంత స్వేచ్ఛో అంత ప్రమాదం!



నిత్యావసరాలు..కూరగాయలు. అల్పాహారాలు ... భోజనాలు.. ఒకటేమిటి.. తినే తిండి దగ్గర నుంచి ధరించే దుస్తులు.. నగలు... ప్రయాణాలు.. విదేశాలు.. వినోదాలు.. ఒకటేంటి సాంకేతికతతో అన్ని సదుపాయాలు ఇంటి ముంగిట్లోకి వచ్చేస్తున్నాయి. ఆండ్రాయిత్ ఫోన్‌తో ఛాటింగ్‌లు.. వాట్సాఫ్ మెసేజ్‌లు... ట్విట్టర్‌లో వీడియోలు.. ఇన్‌స్టాలో అప్‌డేట్లు... ప్రతిదీ క్షణాల్లో ఆప్తులకు మెసేజ్‌లు ఫొటోల రూపంలో వెళ్లిపోతున్నాయి. ఇదే సామాజిక మాధ్యమాల్లో ఉన్న గమ్మత్తు. నలుగురిలో నటించటానికి భయపడే వారు సైతం ఇంట్లో తమంతటగా తామే వీడియోలు చేసి పోస్టులు చేసేస్తున్నారు. స్టేటస్‌లు పెట్టేస్తున్నారు. వీక్షకులు ఇచ్చే లైక్‌లు, పంపే సందేశాలతో మురిసిపోతూ మరింత లేటెస్ట్ వెర్షన్లలో అభినయిస్తూ దూసుకుపోతున్నారు. గూగుల్‌తో ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోయింది.

ఆధునిక మానవుడి జీవితంలో దిన చర్య సామాజిక మాధ్యమాలతోనే మొదలవుతోంది. ప్రపంచంలోని వివిధ తరగతుల ప్రజలకు చేరువై... వారితో సంభాషిస్తున్నారు. భిన్న సంస్కృతులు, ప్రముఖ వ్యక్తులు, ఉద్యమాలు ఇలా ప్రపంచంలో ఏ మారుమూల ప్రాంతంలో ఏమి జరిగినా క్షణాల్లో తెలుసుకోగలుగుతున్నాం. ప్రస్తుతం ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విటర్, స్నాప్‌చాట్, లింక్డ్ ఇన్ వంటి సామాజిక మాధ్యమాలను విరివిగా వాడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూజర్లు తమ వృత్తి, వ్యక్తిగత అవసరాల నిమిత్తం రోజులో సగటున 144 నిముషాలు ఈ మాధ్యమంలో గడుపుతున్నట్లుగా అంచనా. ప్రపంచవ్యాప్తంగా 4.48 బిలియన్ల ప్రజలు వీటిని వినియోగిస్తున్నారు. ఒక్కొక్కరూ సగటున 6.6 వేర్వేరు మాధ్యమాలను వినియోగిస్తున్నారు. 99 శాతం మంది తమ మొబైల్, 1.32 శాతం మంది కంప్యూటర్‌ను వాడుతున్నారు. మొదట్లో సిక్స్ డిగ్రీస్, ఆ తర్వాత ఫ్రెండ్‌స్టర్, లింక్డ్‌ఇన్, ఫేస్‌బుక్, మైస్పేస్, యూట్యూబ్, ట్విట్టర్, ఇన్‌స్టా, వాట్సాఫ్ ఆ తర్వాత ప్రాధాన్యతాక్రమంలో దూసుకొచ్చాయి. స్నాప్‌చాట్, టిక్‌టాక్ కూడా కొన్నాళ్లు బాగా ఆకట్టుకున్నాయి.

టాలెంట్ ప్రదర్శిద్దాం గురూ....

ప్రతిభ ఏ ఒక్కరి సొత్తూ కాదు. ఎవరి టాలెంట్ వారిది. ఆటలు ఆడటం, పాటలు పాడటం, నాట్యం చేయటం, డ్యాన్సు చేయడం, నటనాకౌశలం ప్రదర్శించటం స్టేజీ, డ్రామా, సినిమా వేదికలపై గతంలో ప్రదర్శించి ప్రశంసలు పొందేవారు. సోషల్ మీడియా వేదికగా ఎవ్వరైనా, ఎప్పుడైనా తమ ఇష్టానుసారంగా ప్రతిభను ప్రదర్శించే అవకాశాలున్నాయి. ఫేస్‌బుక్‌లో వీడియోలు, ఇన్‌స్టాలో రీల్స్ ఇప్పుడు హోరెత్తిస్తున్నాయి. గతంలో ఎంఒజి, ఎంఎక్స్ టాకా టక్, యూట్యూబ్ షాట్స్, రోపోసో, స్నాప్ ఛాట్, జిపి, షేర్ ఛాట్ వంటివి గతంలో కొంత ప్రజాదరణ పొందాయి. ఎలాంటి ఖర్చు లేకుండా యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోయేది. ఇప్పుడు ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఖాతాలతో ప్రతిఒక్కరూ తమ టాలెంట్‌ను రీల్స్, వీడియోల రూపంలో అప్‌లోడ్ చేస్తున్నారు. సినిమాల్లోని పాపులర్ పాటలు, కొన్ని సన్నివేశాలు, రాజకీయనాయకుల ప్రసంగాలు, స్కిట్స్, వార్షికోత్సవ వేడుకలు, సమ్మేళనాలు, సదస్సులు, సమావేశాలు, పండుగలు, ఇలా కార్యక్రమం ఏదైనా అందులో సరికొత్తగా నర్తిస్తూ వీడియోలు, రీల్స్ చేస్తున్నారు.

కుటుంబ సభ్యులు, స్నేహితులు

భార్యాభర్తలు కలిసి కామెడీలు, అత్తాకోడళ్లు, తల్లీకుతూళ్లతో సందేశాత్మక విషయాలు వీడియోలు చేసేస్తున్నారు. కాలేజీ పిల్లలు స్నేహితులతోనూ, టీచర్లు పిల్లలతోనూ డ్యాన్సుల చేస్తూ సందడి చేసేస్తున్నారు. హాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ సినీ పరిశ్రమల్లోని అన్ని విభాగాల వారు వీడియోల ద్వారా తమ రోజువారీ వ్యక్తిగత జీవిత విషయాలను అప్‌డేట్ చేస్తున్నారు. ఆరు నెలల పసిగుడ్డు నుంచి వృద్ధుల వరకూ వినోదాత్మకంగానూ, కాలక్షేపం కోసం ఈ మాధ్యమాల్లో గడుపుతున్నారు. చలాకీగా ఆడుకునే పిల్లలు సైతం ఫోన్లలో ఆటలాడుతూ ఊబకాయాన్ని పెంచేసుకుంటున్నారు.

సరికొత్తగా....

శ్రీకాకుళానికి చెందిన ఓ యువకుడు రూ.400లతో ఫోన్‌లో తీసిన షార్ట్‌ఫిల్మ్ ఏకంగా అంతర్జాతీయ బరి వరకూ వెళ్లింది. ఉయ్యూరుకు చెందిన షేక్ అఫ్జల్ కాలేజీ ప్రాజెక్టు వర్కుకోసం కేవలం మూడు గంటల్లో తీసిని 'శీతాకాలం ప్రేమలు' అనే షార్ట్ ఫిల్మ్ విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీలో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ లఘుచిత్రంగా నిలిచింది. 'జైలవకుశ' సినిమాలోని 'నీ కళ్లలోని కాటుక' అనే పాటకు చిన్న కథ జోడించి ఆయనే కొరియోగ్రాఫర్, రచన, దర్శకుడిగా చేసిన కవర్ సాంగ్ యూట్యూబ్‌లో దాదాపు 70 లక్షల మంది వీక్షించారు. టిక్ టాక్ దుర్గారావు దంపతులు నిరంతరం ఏదో ఒక సినిమాల్లోని పాటలకు డ్యాన్సులు చేస్తున్నారు. అంధుడైన రాజు బస్సు ప్రయాణంలో పాడిన పాటకు సినీసంగత దర్శకులు తమన్ అవకాశం ఇస్తానని ప్రకటించారు.

ఆవన్నీ నాణేనికి ఒకపక్క. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాలకు లెక్క లేదు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం పొందాలనే యావతో కొంతమంది ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో షూట్ చేస్తూ తమ జాగ్రత్త మరుస్తున్నారు. ఈవిధంగా ప్రమాదాల్లో ఇరుక్కున్నవారి వార్తలు తరచూ వస్తూనే ఉన్నాయి. ఇవే వేదికగా మోసగాళ్లు కూడా తయారై ఔత్సాహికులను వంచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించటం మేలు

సామాజిక మాధ్యమాల్లో తమ ప్రతిభను వీడియో తీసి పాపులర్ అయిన కవులు, కళాకారులు, గాయకులు, రచయితలు, ఆర్టిస్టులు, సినీరంగ ప్రముఖులు ఎందరో ఉన్నారు. వేగంగా పాపులర్ అవ్వటం, ఆ వెంటనే విమర్శల పాలవ్వటం వంటివి కూడా జరుగుతూ ఉంటాయి. డేటా చౌర్యం, విద్వేష పూరిత ప్రసంగాలు, మానసిక ఆరోగ్యంపై ప్రభావం, ఎన్నికల ఫలితాల తారుమారు, తప్పుడు సమాచార వ్యాప్తితో అవి చేస్తున్నాయనేది ఆరోపణలు కూడా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయాల కారణంగా అనేక సైబర్ మోసాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకుంటే వార్తలు, షాపింగ్, బిజినెస్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర వ్యాపార రంగాలకు సామాజిక మాధ్యమాలు ఉపయోగకరంగా ఉంటాయని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

రంగవల్లి



28 చుక్కలు 2 వరుసలు 2 వచ్చే వరకు (సరి చుక్క)



కె.విజయలక్ష్మి,
కర్నూల్ జిల్లా,
ఆదోని.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

సంస్కృతి, వారసత్వానికి భాషతో ముడి

- మంత్రి సత్యకుమార్
- ముగిసిన ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి- వన్‌టౌన్ (విజయవాడ)

సంస్కృతి, వారసత్వం, పండగలు భాషతోనే ముడిపడి ఉంటాయని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్య శాఖల మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. విజయవాడ కెబిఎన్ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభ రెండో రోజైన ఆదివారం ముగిసింది. మహాసభలో సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ అనుకరించడం ద్వారా పిల్లలు భాషను నేర్చుకుంటారని తెలిపారు. మాతృభాష నేర్చుకున్న పిల్లల్లో తెలివితేటలు, సృజనాత్మకత ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రుల చొరవతోనే మాతృభాష మనుగడ సాధ్యపడుతుందన్నారు. ప్రాచీన తెలుగు భాష అధ్యయన కేంద్రానికి టిడిపి కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. త్వరలోనే సొంత భవనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. భాషాభివృద్ధి ప్రభుత్వాల చేతుల్లోనే ఉంటుందన్నారు. ఎంఎల్‌సి పి.అశోక్‌బాబు మాట్లాడుతూ భాషను అభివృద్ధి చేసే బాధ్యత రాజకీయ వ్యవస్థపైనే ఎక్కువగా ఉంటుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో విద్యా విధానంలో మార్పులు వస్తాయని ఆశిస్తున్నానన్నారు. ఆంగ్లంలో ఉన్న జిఒలు తెలుగులో రావాలని ఆకాంక్షించారు. సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సహజ సిద్ధంగా వచ్చేదే మాతృభాషన్నారు. పిల్లలకు మాతృభాషలో కాకుండా ఇతర భాషల్లో బోధన చేయడం సరికాదని తెలిపారు. భాషాభివృద్ధిలో రాజకీయ నాయకుల పాత్ర చాలా ముఖ్యమైందని, భాషపై సమాజం ఎంత ఆధారపడిందో ఆ భాష ప్రాధాన్యత, గొప్పదనాన్ని బట్టి తెలుస్తుందన్నారు. కృత్రిమ భాషతో పిల్లలకు విద్యాబోధనలు చేయడం వారి వ్యక్తిత్వాన్ని హరించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ మహాసభలో భాగంగా 'ఇతర రాష్ట్రాల ప్రతినిధుల సదస్సు' జరిగింది. ఈ కార్యక్రమంలో ఇతర రాష్ట్రాలు, వివిధ దేశాల నుంచి వచ్చిన తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు. మరో వేదికపై తెలుగులో న్యాయపాలనపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ బి.కృష్ణమోహనరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ నగేష్ భీమపాక హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు, ఎంఎల్‌ఎ మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలోనే జరగాలి : మంత్రి కందుల దుర్గేష్

ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే జరగాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

మహాసభ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి 6వ తరగతి వరకూ తెలుగులోనే బోధన ఉండాలన్నారు. మాతృ భాష పరిరక్షణలో ప్రభుత్వంతోపాటు ప్రజల పాత్ర కూడా కీలకం కావాలని పేర్కొన్నారు. మాతృభాషలోనే మాట్లాడాలని, ప్రాథమిక విద్యాబోధన తెలుగులోనే జరగాలని మహాసభల్లో తీర్మానించారు. ఈ ప్రతులను మంత్రికి అందజేశారు.

పడగొట్టినా.. తోక మిగిలే!

బుమ్రా నాలుగు వికెట్ల ప్రదర్శన
లబుషేన్, కమిన్స్, లయాన్ ప్రతిఘటన
ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 228/9
భారత్ తొలి ఇన్నింగ్స్ 369/10
బాక్సింగ్ డే టెస్టు 4వ రోజు



మెల్‌బోర్న్ : జస్‌ప్రీత్ బుమ్రా (4/56), మహ్మద్ సిరాజ్ (3/66) నిప్పులు చెరిగారు. బుమ్రా మిడిల్ ఆర్డర్‌ను కకావికలం చేయగా.. టాప్ ఆర్డర్ సంగతి సిరాజ్ చూసుకున్నాడు. కానీ, మార్నస్ లబుషేన్ (70, 139 బంతుల్లో 3 ఫోర్లు), పాట్ కమిన్స్ (41, 90 బంతుల్లో 4 ఫోర్లు), నాథన్ లయాన్ (41 నాటౌట్, 54 బంతుల్లో 5 ఫోర్లు) రాణించటంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో మంచి స్కోరు దిశగా సాగుతోంది. 82 ఓవర్లలో 9 వికెట్లకు 228 పరుగులు చేసిన ఆస్ట్రేలియా.. నాల్గో రోజు ఆట ముగిసే సమయానికి 333 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంతకుముందు, నితీశ్ కుమార్ రెడ్డి (114, 189 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (50) రాణించటంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా 105 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకుంది. ఆసీస్ బౌలర్లు పాట్ కమిన్స్, స్కాట్ బొలాండ్, నాథన్ లయాన్‌లు మూడేసి వికెట్లు పడగొట్టారు.

బుమ్రా, సిరాజ్ అదుర్స్ : ఆసీస్ పర్యటనలో సిరాజ్ నిలకడగా విఫలమయ్యాడు. మెల్‌బోర్న్‌లో కీలక సమయంలో సిరాజ్ వికెట్ల వేట సాగించటం భారత్‌కు కలిసొచ్చింది. ఆసీస్ యువ ఓపెనర్ శామ్ కాన్‌స్టాస్ (8)ను క్లీన్‌బౌల్డ్ చేసిన బుమ్రా.. భారత్‌కు అదిరే బ్రేక్ అందించాడు. మరో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (21)ను సాగనంపి సిరాజ్ వికెట్ల వేటలో జత కలిశాడు. బుమ్రా, సిరాజ్ జోరుతో ఉదయం సెషన్లోనే ఆసీస్ ఓపెనర్లను కోల్పోయింది. లంచ్ విరామానికి 53/2తో నిలిచింది. ఓ ఎండ్‌లో మార్నస్ లబుషేన్‌తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించే పనిలో పడిన స్టీవ్ స్మిత్ (13) సిరాజ్ అవుట్ చేయటంతో.. మిడిల్ ఆర్డర్ కథ బుమ్రా ముగించాడు. అక్కడ్నుంచి వరుస ఓవర్లలో వికెట్లు పడ్డాయి. బుమ్రా ఒకే ఓవర్లో ప్రమాదకర ట్రావిశ్ హెడ్ (1), మిచెల్ మార్ష్ (0)లను అవుట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (2) వికెట్లను గాల్లో ఎగరేశాడు. 80/2తో సాఫీగా సాగుతున్న ఆసీస్ ఇన్నింగ్స్.. బుమ్రా దెబ్బకు 91/6తో కష్టాల్లో కూరుకుంది.

మెరిసిన లబుషేన్ : బ్యాటింగ్ లైనప్‌లో అందరూ విఫలమైనా.. మార్నస్ లబుషేన్ (70) నిలబడ్డాడు. బుమ్రా బుల్లెట్ల ఒత్తిడిని తట్టుకుని వికెట్ కాపాడుకున్నాడు.

స్కోరు వివరాలు : ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 474/10 **భారత్ తొలి ఇన్నింగ్స్ :** 369/10 **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ :** శామ్ కాన్‌స్టాస్ (బి) బుమ్రా 8, ఉస్మాన్ ఖవాజా (బి) సిరాజ్ 21, మార్నస్ లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 70, స్టీవ్ స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 13, ట్రావిశ్ హెడ (సి) నితీశ్ (బి) బుమ్రా 1, అలెక్స్ కేరీ (బి) బుమ్రా 2, పాట్ కమిన్ (సి) రోహిత్ (బి) జడేజా 41, నాథన్ లయాన్ నాటౌట్ 41, స్కాట్ బొలాండ్ నాటౌట్ 10, ఎక్స్‌ట్రాలు : 16, మొత్తం : (82 ఓవర్లలో 9 వికెట్లకు) 228.

వికెట్ల పతనం : 1-20, 2-43, 3-80, 4-85, 5-85, 6-91, 7-148, 8-156, 9-173.


బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 24-7-56-4, ఆకాశ్ దీప్ 17-4-53-0, మహ్మద్ సిరాజ్ 22-4-66-3, రవీంద్ర జడేజా 14-2-33-1, నితీశ్ కుమార్ రెడ్డి 1-0-4-0, వాషింగ్టన్ సుందర్ 4-0-7-0.

కవిత్వ విమర్శలో పదునైన ఆయుధం

'చెమట చెక్కిన వాక్యం'

- ప్రముఖ కవి లక్ష్మీ నరసయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



'చెమట చెక్కిన వాక్యం' ఆవిష్కరిస్తున్న దృశ్యం

తెలుగు కవిత్వ విమర్శలో పదునైన ఆయుధంగా కెంగార మోహన్ రాసిన 'చెమట చెక్కిన వాక్యం' నిలుస్తోందని ప్రముఖ కవి, విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య పేర్కొన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో 'చెమట చెక్కిన వాక్యం' కవిత్వ పరామర్శ గ్రంధాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 60 కవిత్వ పుస్తకాలను లోతైన దృక్పథంతో మార్క్సిస్టు కోణంలో చూడటం, సామాజిక కోణంలో విశ్లేషించడం, మానవీయ కోణంలో వివరించడం ఈ పరామర్శ ప్రత్యేకతగా పేర్కొన్నారు. ప్రసిద్ధ కవులు మొదలుకొని వర్ధమాన కవులు సంపుటాలను తమదైన శైలిలో పరిచయం చేయడం వల్ల ఈ గ్రంథం వైవిధ్యతను సంతరించుకుందన్నారు. ప్రముఖ కవి జి వెంకటకృష్ణ మాట్లాడుతూ.. కె శివారెడ్డి, లోసారి సుధాకర్, గుంటూరు శేషేంద్ర శర్మ, సి నారాయణరెడ్డి, అప్సర్ కవులు నుంచి అంతర్జాతీయ స్థాయిలోని ప్రపంచ విప్లవకారుడు పాబ్లో నెరుడా, ఇరానియన్ కవి అబ్బాస్ కియరోస్తమి వంటి కవుల కవిత్వాలను విమర్శనాత్మక దృక్పథంతో చూశారని చెప్పారు. ముందు మాటలో డార్విన్, సిగ్మండ్ ఫ్రాయిడ్, కారల్‌మార్క్స్ మొదలైన వారి జీవితాలను చదివిన వ్పుడు ఆధునిక సాహిత్యానికి భూమిక ఏర్పడుతుందని చెప్పడం భిన్నంగా ఉందన్నారు. దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా ప్రగతిశీల సాహిత్యాన్ని మాత్రమే ఎంచుకోవడం వల్ల ఈ రచన భిన్నంగా కనిపిస్తుందన్నారు. సామాజిక, బహుజన, మైనార్టీ, వివిధ అస్తిత్వ ఉద్యమాల కవులను ప్రత్యేకంగా పేర్కొనడం వల్ల ఈ కవిత్వ గ్రంథం తెలుగు సాహిత్య లోకంలో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకుంటుందన్నారు. ప్రముఖ కవి, ఎసిబి అదనపు ఎస్‌పి లోసారి సుధాకర్ మాట్లాడుతూ.. ఈ కవిత్వ గ్రంథం విమర్శలకు కొత్తదారులను పరిచిందన్నారు. ప్రగతిశీల సాహిత్య దృక్పథాన్ని ధ్రువీకరించగలి గిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాహితి స్రవంతి రాష్ట్ర మాజీ అధ్యక్షులు వొరప్రసాద్ మాట్లాడుతూ.. గ్రంథంలో కవిత్వాన్ని మాత్రమే ఎంచుకోవడం వల్ల విమర్శ విస్తృతి పెరిగిందని తెలిపారు. గ్రంథ రచయిత కెంగార మోహన్ మాట్లాడుతూ.. వర్ధమాన సాహిత్యంలో కవిత్వాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ గ్రంధాన్ని రచించామని, కవులు, విమర్శకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉందని చెప్పారు. తొలి ప్రతిని ప్రముఖ కథా రచయిత మారుతి పౌరోహితంకు అందజేశారు. కార్యక్రమాన్ని సాహితి స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్యరంజన్ ప్రారంభించగా, రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతిశ్రీ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో కవులు శిఖామణి, సత్యాజి, వైష్ణవిశ్రీ, జాషువా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నారాయణరావు, సాహితీ స్రవంతి నంద్యాల జిల్లా కార్యదర్శి నీలం వెంకటేశ్వర్లు, గుడివాడ కార్యదర్శి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హంపికి అభినందనలు



న్యూయార్క్ : 2024లో భారత్ చెస్‌కు మరో కిరీటం అందించింది. ఇటీవల దొమ్మరాజు గుకేశ్ ఫిడె ప్రపంచ చాంపియన్‌గా అవతరించగా.. తాజాగా తెలుగమ్మాయి కోనేరు హంపి (37) ఫిడె ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచింది. 2019లో తొలిసారి ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ సాధించిన హంపి.. 2012లో మూడో స్థానంలో, 2023లో రన్నరప్‌గా నిలిచింది. వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్స్‌లో నాలుగుసార్లు టాప్-3లో నిలిచిన గ్రాండ్‌మాస్టర్ ఘనతను హంపి సొంతం చేసుకుంది.

పదో సీడ్‌గా మొదలెట్టి : కోనేరు హంపి వయసు 37. టోర్నీలో ఆమె సీడింగ్ 10. టైటిల్ రేసులో హంపిని ఎవరూ ఫేవరేట్‌గా పరిగణించలేదు. కానీ హంపి ర్యాపిడ్ రౌండ్‌లో రఫ్ఫాడించింది. ఆఖరు రౌండ్ ఆరంభానికి ముందు సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగిన హంపి.. చివరి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది. ఇండోనేషియా గ్రాండ్‌మాస్టర్ ఐరిన్ సుకందర్‌పై నల్ల పావులతో ఎత్తులు వేసి విజయాన్ని అందుకుంది. ఇతర గేముల్లో ఎవరూ ఫలితం రాబట్టలేదు. 8.5 పాయింట్లతో హంపి అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెంజున్ (8), లాగ్నో (8), టాన్ (8), ద్రోణవల్లి హారిక (8), అఫ్రూజ (8), అలెగ్జాండ్ర (8)లు 0.5 పాయింట్ల తేడాతో టాప్-7లో నిలిచారు. ఓపెన్ విభాగంలో రష్యా గ్రాండ్‌మాస్టర్‌లో వొలోడార్ మర్జిన్ (18) విజేతగా నిలిచాడు. అర్జున్ ఎరిగేశి ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

సిఎం అభినందనలు

కోనేరు హంపిని సిఎం చంద్రబాబు నాయుడు అభినందించారు. దేశానికే గర్వకారణమని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అసాధారణమైన పట్టుదల, సంకల్పం, నైపుణ్యం హంపి సొంతమని, మరిన్ని విజయాలు సాధించి భావితరాలకు స్ఫూర్తిగా హంపి నిలవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. హంపి విజయం దేశానికే గర్వకారణమని వ్యవసాయ శాఖమంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. హంపి విజయం తెలుగుజాతికి గర్వకారణమని శాప్ చైర్మన్ రవినాయుడు మరో ప్రకటనలో తెలిపారు.

ఓవరాల్ ఛాంప్ విశాఖ

- గుంటూరులో ముగిసిన మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

క్రీడాకారులను ప్రోత్సహిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు ఎన్‌టిఆర్ స్టేడియంలో శని, ఆదివారాల్లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. మెన్ అండ్ ఉమెన్ వాకింగ్ ఈవెంట్ నిర్వహించారు. 100 మీటర్ల రన్, ట్రిపుల్ జంప్, హై జంప్, జావిలిన్ త్రో జరిగాయి. అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ విశాఖ జిల్లా వారు దక్కించుకున్నారు. రెండో స్థానం గుంటూరు, మూడో స్థానం బాపట్ల జిల్లాలు దక్కించుకున్నాయి. 5కే వాక్, 100కే రన్, జావాలిన్, 5కే వాక్, 400 మీటర్ల రన్, 100 మీటర్ల రన్ పోటీలు నిర్వహించారు. విశాఖకు చెందిన రవిప్రతాప్ 200 మీటర్ల పరుగు, 110 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించారు. విజేతలకు మంత్రి పెమ్మసాని మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తగిన చేయూతను ఇచ్చేందుకు క్రీడామైదానాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. వెటరన్ క్రీడాకారులనూ ప్రోత్సహిస్తామన్నారు. ప్రతిభ కనబర్చిన వెటరన్ క్రీడాకారులు పెంటెల సుబ్బాయమ్మ, పెంటేల జైహింద్ గురూజీని అభినందించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లాల్ వజీర్, సెక్రటరీ లక్ష్మీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి నశీర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, టిడిపి నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, క్రీడాకారులు, కోచ్‌లు మద్దిలేటి, సురేష్, పద్మ, బేగం, ప్రభుదాస్, వెంకట్రాది, లక్ష్మి, కాలేషా; షఫీ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68